
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం



ఆదివారం 23 నవంబరు 2025

బీసీ నేతలకు 'అధ్యక్ష' పదవులు!



- ఖమ్మం డీసీసీ అధ్యక్షుడిగా నూతి సత్యనారాయణ, భద్రాద్రి అధ్యక్షురాలిగా తోట దేవీ ప్రసన్న
- ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా దీపక్‌చౌదరి
- జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవుల ఎంపికపై వీడిన ఉత్కంఠ

6

దోపిడీదారులు, దళారులను

దగ్గరకు రానివ్వం

- మా ప్రభుత్వం ప్రజలకే అంకితం
- 2047 నాటికి ప్రపంచంతో తెలంగాణ పోటీ
- నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క

వైరా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పైసా పైసా పోగుచేసి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నిరంతరం అభివృద్ధి వైపు తమ అడుగు అని, ప్రజలకే తమ ప్రభుత్వం అంకితమని.. దోపిడీదారులను, దళారులను దగ్గరకు రానివ్వబోమని స్పష్టం చేశారు. 2047నాటికి ప్రపంచంతో తెలంగాణ రాష్ట్రం పోటీపడే స్థాయికి చేరుకుంటుందన్నారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం ఒక గేమ్ ఛేంజర్ అని, విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమవుతుందని అన్నారు. శనివారం ఖమ్మం జిల్లా వైరాలో రూ.200కోట్లతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. అలాగే వైరా నియోజకవర్గంలో రూ.21కోట్లతో నిర్మించనున్న ఏడు 33/11కేవీ విద్యుత్ స్టేషన్ల నిర్మాణాలకు వైరా నుంచే వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభలో భట్టి విక్రమార్క ప్రసంగించారు. నిరంతరం అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వ లక్ష్యమని.. రాష్ట్రంలోని 1.15కోట్ల మంది మహిళలకు నాణ్యమైన చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రూ.13,500కోట్లతో రాష్ట్రంలోని 93లక్షలమంది కుటుంబాలకు సన్నబియ్యం, 53లక్షల కుటుంబాలకు 200యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలను మహిళలకు అందిస్తామని, ఇప్పటికే రూ.27వేల కోట్ల రుణాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో కనీసం ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఉండాలన్నదనే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే వైరా నియోజకవర్గంలో రూ.200కోట్లతో స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఈ స్కూల్‌లో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా అందులోనే నివాసం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ స్కూల్ నిర్మాణం కోసం ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఖాతాలో రూ.30కోట్ల నిధులు జమ చేశామని, ప్రతీ 15రోజులకోసారి నిధులు జమ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పెరిగిన ధరలకు (మిగతా 6వ పేజీలో)



పాత రిజర్వేషన్ ప్రకారం ఒక్క ఓటుతో సర్పంచ్ పదవి వరించిన అభ్యర్థులకు కండువాలు కప్పిన మంత్రి పొంగులేటి (ఫైల్)

- సర్పంచ్ రిజర్వేషన్లలో చేజారుతున్న అదృష్టాలు
- గత నోటిఫికేషన్‌లో గిరిజన తండాల్లో బీసీలకు రిజర్వేషన్
- ఒక్కరున్న చోట వారికే పదవి ఖాయమని భావించారు..
- కానీ ఇప్పుడు జనరల్ కావడంతో సీన్ రివర్స్ అయ్యే అవకాశం

రిజర్వేషన్ రివర్స్!

రిజర్వేషన్ల ప్రక్రియలో ప్రభుత్వం తెచ్చిన మార్పులతో కొన్ని పల్లెల్లో సీన్ రివర్స్ అవుతోంది. పలు చోట్ల ఆశావహుల జాతకాలు తారుమారు కానున్నాయి. సర్పంచ్ పదవి దక్కుతుందనుకున్న వారి అదృష్టం చేజారిపోతుంది. గత సెప్టెంబరు 29 నాటి నోటిఫికేషన్‌లో రిజర్వేషన్లతో గిరిజన తండాల్లో కూడా సర్పంచ్ పదవులు బీసీలకు దక్కాయి. అయితే ఓటర్లు ఒకరో ఇద్దరో బీసీలు ఉండడంతో.. వారే సర్పంచ్‌లని భావించగా, ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ మార్పు చేసి.. ప్రభుత్వం ఎన్నికలకు వెళుతున్నందు వల్ల మళ్లీ బీసీ రిజర్వేషన్లలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో సర్పంచ్ పదవుల్లో పలుచోట్ల ఆశావహులకు షాక్ తగలనుంది. ఫలితంగా పంచాయతీ ఎన్నికల వేళ.. జిల్లా రాజకీయాల్లో చిత్ర విచిత్రాలు చోటు చేసుకోనున్నాయి.

జాతకాలు తారుమారు!

ఖమ్మం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాజకీయాల్లో అదృష్టం కలిసి రావాలంటారు పెద్దలు.. దీంతో పాటు ఆలస్యం అమృతం విషం అని అంటారు కూడా..! ఇది అక్షరాల నిజం.. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఖరారు చేసి ఎన్నికల కోసం గత సెప్టెంబరు 29న ఇచ్చిన నోటిఫికేషన్‌లో గిరిజనతండాలలో బీసీలకు సర్పంచ్‌పదవులు రిజర్వేషన్ కావడం, ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లు తగ్గడంతో.. తండాల్లో సర్పంచ్ పదవులు జనరల్ కావడంతో ఒక్కసారిగా ఆశావహుల జాబితాలు తారుమారవుతున్నాయి. గిరిజన తండాల్లో ప్రధానంగా ఈ పరిస్థితి కనిపిస్తుంది. కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారం అనధికారికంగా ప్రతిపాదించిన సమాచారం ఇలా ఉంది.

జిల్లాలో ఇలా సర్పంచ్ పదవి చేతిదాక వచ్చి.. ఇప్పుడు సర్పంచ్ పదవి తారుమారు అవుతున్నందు వల్ల అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. సెప్టెంబరు 29న నోటిఫికేషన్‌లో 42శాతం బీసీలకు రిజర్వేషన్ కేటాయింపు చేయడంతో అప్పటి రిజర్వేషన్ల ప్రక్రియ వేరుగా ఉంది. బీసీలకు రిజర్వేషన్ పెంచడంతో గిరిజన తండాలు కూడా బీసీలకు సర్పంచ్ పదవి రిజర్వేషన్ చేయడంతో అక్కడ నిరసనలు వ్యక్తమయ్యాయి. మొత్తం ఎస్టీ ఓటర్లు ఉన్న తండాల్లో ఒక్కరుఇద్దరు బీసీ ఓటర్లు ఉంటే రిజర్వేషన్ల ప్రకారం బీసీలకే సర్పంచ్ పదవి దక్కేలా ఉండేది. ఇప్పుడు బీసీ రిజర్వేషన్ (మిగతా 6వ పేజీలో)

భద్రాద్రి జిల్లాలో నేడు తేలనున్న రిజర్వేషన్లు

- మొత్తం 471 పంచాయతీలు.. 4168 వార్డులు
- ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు, సిబ్బంది

వివరాలు 6లో



బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

పంచాయతీల అభివృద్ధికి

అధిక ప్రాధాన్యం

- గ్రామ స్వరాజ్యానికి కట్టుబడిన ప్రభుత్వం
- మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు
- మహిళలకు ప్రభుత్వం తరఫున పుట్టింటి చీరలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం కల్పిస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శనివారం రఘునాథపాలెం మండలం శివాయిగూడెం నుంచి మంచుకొండ వరకు బీటీ రహదారి నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ఆడపడుచులకు పుట్టింటి చీరల ఉచిత చీరల కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ప్రతీ మహిళ ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశ పెడుతోందన్నారు. మారుమూల గ్రామాలకు రహదారులు, తాగునీరు.. ఇలా అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. వ్యవసాయానికి కావాల్సిన సాగు నీరు మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా ఇవ్వడం జరిగిందనిన్నారు. త్వరలో బుగ్గవాగు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించి మండే వేసవిలో కూడా చెరువులను నీటితో నింపి భూగర్భ జలాలను పెంచుతామన్నారు. రైతులు పామాయిల్ సాగు చేయడం ద్వారా చీడ పీడలు, కోతుల బెడద ఉండదన్నారు. పామాయిల్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందుతారన్నారు. మహిళలు తమ నివాసాలను పరిశుభ్రంగా ఉంచినట్లే.. గ్రామాల్లోని వీధులు పరిశుభ్రంగా ఉంటే ప్రజారోగ్యం బాగుంటుందని తెలిపారు. ఖమ్మం అర్బన్ ప్రాంతంగా ఉన్న ప్రాంతాన్ని రఘునాథపాలెం మండలంగా మార్పులు చేసి రాష్ట్రంలోనే విద్య వ్యవసాయం ఇతర రంగాల్లో ఆదర్శంగా రూపొందించడం జరుగుతుందన్నారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రామరాజ్యం పేరుతో..

బీజేపీ రాక్షస పాలన

- పోలవరంతో భద్రాద్రి ఉనికికే ప్రమాదం
- ఆపరేషన్ కగార్ ఓ పచ్చి బూటకం
- ఎన్‌కౌంటర్‌లపై న్యాయ విచారణ చేయాలి
- సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి
- భద్రాద్రిలో ముగిసిన సీపీఐ ప్రచార జాత



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

భద్రాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రామరాజ్యం పేరుతో బీజేపీ దేశంలో రాక్షస పాలన కొనసాగిస్తూ మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తోందని సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం భద్రాచలంలో సీపీఐ శతవసంత ఉత్సవాల ప్రచారజాత ముగింపు సభలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ సర్కారు కులాలు, మతాల పేరుతో దేశంలో గందరగోళ వాతావరణాన్ని సృష్టిస్తోందని, రాజ్యాంగం అమలు పర్చాల్సిన పాలకులు హిందుత్వ ఎజెండాను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే భద్రాచలం రామాలయం నీటిలో మునిగిపోయే ప్రమాదముందని నీటిపారుదల నిపుణులు చెబుతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఏపీలో కలిసిన ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని, గోదావరి కరకట్టలను పటిష్ట పరిచి వరద బారి నుంచి ఈ ప్రాంత ప్రజలను రక్షించాలన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలివెన శంకర్, ఎం.బాలనర్సింహా మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ ఓ పచ్చి బూటకమన్నారు. ఎన్‌కౌంటర్ల పేరుతో మావోయిస్టులను పట్టుకొని చిత్రహింసలకు గురి చేసి హతమారుస్తున్నారన్నారు. ఈ ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషాలు మాట్లాడుతూ.. సీపీఐ అంతరాలు లేని సమాజ స్థాపనే ధ్యేయంగా పోరాడుతోందన్నారు. పదేళ్ల ప్రస్థానంలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్న సీపీఐ.. ప్రజాక్షేత్రంలో సబ్బండ వర్గాల ప్రజలు సమస్యల పరిష్కారం కోసం మరింత ఎరుపెక్కిన పోరాటాలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడుతోందన్నారు. సీపీఐ శతవసంత ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో డిసెంబరు 26వ తేదీన (మిగతా 7వ పేజీలో)



ఉపాధి పనులు చేస్తున్న కార్మికులు

ఉపాధిలో

ఆమెదే పైచేయి

- ఉపాధి హామీ పనుల్లో మహిళా కూలీల ముందంజ
- జిల్లాలోని 471 పంచాయతీల్లో వారిదే జోరు

కొత్తగూడెం అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అన్నింటిలో ఆమెదే పైచేయి. ఇంటిల్లిపాదికి అవసరమైన పనులు చేయడంతో పాటు ఉపాధి హామీ పనుల్లో సైతం తమదైన ముద్ర వేస్తున్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం మహిళలకు చేదోడువాదోడుగా నిలుస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు పనులకు వెళుతున్న వారిలో పురుషుల కంటే మహిళా కూలీల సంఖ్యనే అధికంగా ఉంటుంది. ఒక్కొక్క మహిళ సరాసరిగా నిత్యం 250 పైచిలుకు వరకు జీతభత్యంగా పొందుతున్నారు. కొందరు మహిళలు నెలలో 20రోజులు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఈ డబ్బులతో కుటుంబాలను పోషిస్తూ.. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

జిల్లాలోని 471 పంచాయతీల్లో..

ఉపాధి హామీ పనుల్లో జిల్లాలోని 471 పంచాయతీల్లో మహిళలదే జోరు కనిపిస్తోంది. పని (మిగతా 6వ పేజీలో)

విపత్తు నిర్వహణపై

అధ్యయనం

- దుమ్ముగూడెంలో పర్యటించిన ఢిల్లీ ఇండియా హౌస్ బృందం



బొజ్జిగుప్పలో అధ్యయనం చేస్తున్న బృందం

దుమ్ముగూడెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విపత్తుల నిర్వహణపై అధ్యయనం చేసేందుకు ఢిల్లీ ఇండియా హౌస్ బృందం సభ్యులు శనివారం మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. వరద ప్రభావిత సున్నం బట్టి ప్రాంతాన్ని పరిశీలించి.. స్థానికులతో మాట్లాడారు. గోదావరి నదికి వరదలు వస్తే ఎక్కడ రక్షణ పొందుతారు!? ఎన్నిసార్లు వరదలు సంభవించాయి!? కలిగిన నష్టం, పునరావాసం వంటి పలు విషయాలను ఈ సందర్భంగా వారు అడిగి తెలుసుకున్నారు. మంచి ప్యాకేజీ ఇస్తే గ్రామాన్ని వదిలి ప్రభుత్వం చూపించే ప్రత్యామ్నాయ ప్రాంతాలకు వెళ్తామని గ్రామానికి చెందిన అర్జునరావు తెలిపారు. అలాగే చిన్నపాటి వరదలకు ఇబ్బంది కలిగించే సున్నంబట్టి - బైరాగులపాడుల మధ్య లోలెవల్ (మిగతా 6వ పేజీలో)

బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

- చరిత్రలో నిలిచిపోయేలా శతాబ్ది ఉత్సవాలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజాస్వేచ్ఛను ప్రభుత్వాలు ప్రజాస్వామ్యం గొంతు నులిమేస్తున్నాయన్నారు. శనివారం ఖమ్మంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో కూనంనేని మాట్లాడారు.బూటకపు ఎన్‌కౌంటర్లపై తక్షణమే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శాంతి చర్చలకు మావోయిస్టు నాయకులు అంగీకరించినా.. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. నిరాయుధులుగా దొరికిన మావోయిస్టులను పట్టుకొని కాల్చి చంపుతున్నారన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రకృతి సంపదను దోచి పెట్టేందుకు ఇలాంటి హత్యాకాండలు జరుగుతున్నాయని ఆరోపించారు. మావోయిస్టులు ప్రజా సమస్యలపై అనేక (మిగతా 7వ పేజీలో)

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను..

తక్షణమే రద్దు చేయాలి

7

- ఖమ్మంలో టీయూసీఐ నిరసన
- లేబర్ కోడ్ జిరాక్స్ ప్రతుల దహనం

ఏదీ.. అభయహస్తం?

- ప్రభుత్వం వద్ద రూ.కోట్లల్లో ఉండిపోయిన పొదుపు సొమ్ము
- గత ప్రభుత్వంలో పథకం రద్దు
- పొదుపు సొమ్మును తిరిగి చెల్లించని వైనం
- ఆ సొమ్ములను వడ్డీతో చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన
- నేటికీ అమలుకు నోచుకోని హామీ
- ఉమ్మడి జిల్లాలో 2 లక్షల మంది సభ్యులు
- రావాల్సిన నగదు రూ. 150 కోట్లకు పైనే..



అశ్వారావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా చిట్ ఫండ్ కంపెనీ, వ్యక్తులు, సంస్థలు, ప్రజల నుంచి సొమ్ములు వసూలు చేసి వాటిని తిరిగి చెల్లించకపోతే కోట్లాది రూపాయలు వసూలు చేసి పరారయ్యారని కేసులు పెడతాం. ఈ విషయంలో ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. కానీ ఇందుకు భిన్నంగా ప్రభుత్వమే నిరుపేదలైన మహిళల నుంచి వందల కోట్ల రూపాయల సొమ్మును వసూలు చేసింది. ఆ తర్వాత పథకాన్ని అర్థాంతరంగా రద్దు చేయడమే కాకుండా వసూలు చేసిన సొమ్ములను తిరిగి చెల్లించకపోతే ఎవరు చర్యలు తీసుకోవాలి? కోర్టులు సుమోటాగా తీసుకొని చర్యలు తీసుకునే అర్హత లేదా? ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు దీనిపై పోరాటం చేయడానికి పనికొచ్చే సంఘటన కాదా?

... ఇదీ ప్రస్తుతం రాష్ట్రంలో జరిగిన భారీ మోసం. ప్రభుత్వమే లక్షలాది మంది మహిళలను మోసగించిన ప్రత్యక్ష సంఘటన. గత ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా రద్దు చేసిన ఈ పథకంలో మహిళలందరికీ న్యాయం చేస్తామని, వడ్డీతో సహా సొమ్ములు చెల్లిస్తామని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు గత ఎన్నికల సమయంలో ప్రకటించారు. కానీ అది ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు.

అభయ హస్తం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ. 1600 కోట్ల వసూలు

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం 2009, నవంబరు 1వ తేదీన స్వయం సహాయక సంఘాల సభ్యులకు వారి జీవిత చరమాంకంలో 60 సంవత్సరాలు దాటిన తరువాత ప్రభుత్వ ఉద్యోగుల వలే ప్రతి నెలా రూ.500ల నుంచి 5వేల వరకు పింఛన్ అందించాలని 'అభయ హస్తం పింఛన్ పథకం'ను (మిగతా 6వ పేజీలో)

ఇంటి పట్టాల పంపిణీ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో ఇంటి పట్టాల పంపిణీ ప్రక్రియ తక్షణమే ప్రారంభించాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ జీవో నెం.76 ద్వారా ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఇంటి పట్టాలు పంపిణీ చేయాలన్నారు. పట్టణంలో ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న వారికి యాజమాన్య హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం జీవో నెం.76 ప్రవేశ పెట్టగా సుమారు రెండు వేల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని, లేని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పని చేయాలి

▸▸ ఐటీడీఏ పీవో రాహుల్



భద్రాచలంలో ప్రసంగిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన సం క్షేమశాఖ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పని చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శనివారం భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ సమావేశంలో పీవో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు విద్యతోపాటు సామాజిక స్పృహ, సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడానికి ఉపాధ్యాయులు ముందుండాలన్నారు. హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషలలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో మొత్తం 200 మంది ఉ పాధ్యాయులు, డీఆర్పీలు పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ అశోక్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరునాయక్, ఏసీఎంవో రమేష్, జీసీడీవో అలివేలు మంగతాయారు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పన కోసం కృషి

ఇల్లెందుటౌన్: ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మౌళిక వసతుల కల్పన కోసం కృషి చేస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు. శనివారం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించారు. వైద్యశాలకు కావాల్సిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న వైద్యశాలకు పూర్తిస్థాయిలో మెరుగైనా సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఇల్లెందు వైద్యశాలలో రోగులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వైద్యం కోసం వచ్చే రోగులకు సరైన మందులతో పాటు ఇతర సదుపాయాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర సమయంలో రోగులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అంబులేన్స్ సౌకర్యం త్వరలో కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బిర్సాముండా జీవితం స్ఫూర్తిదాయకం



సమావేశంలో మాట్లాడుతున్న రవి నాయక్

బూర్గంపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బిర్సాముండా జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవినాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకొని తాళ్లగొమ్మూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల గౌరవం, భూమి హక్కుల కోసం బిర్సాముండా చేసిన ఉద్యమం చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఈ సమావేశంలో రంగా కిరణ్, పొడియం బాలరాజు, కుంజా సంతోష్ పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి

జూలూరుపాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ రవి నాయక్ అన్నారు. బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాలలో భాగంగా మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూక్యా రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ద్విచక్ర వాహన ర్యాలీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిర్సాముండా బ్రిటీష్ పాలనకు, మత మార్పిడిలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలను చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గిరిజనులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, సత్యనారాయణ, బాలకిషన్, రామారావు, శ్రీను, చరణ్, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

చుంచుపల్లి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని ఫిర్యాదుదారులకు తప్పక న్యాయం జరుగుతుందని నమ్మకాన్ని కలిగించాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. శనివారం కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాలనుసారం డివిజన్ పరిధిలో శాంతి భద్రతలు విగాధం కలుగకుండా చూసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌తో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ కేసుల స్థితిగతులను ఆరా తీశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల సక్రమంగా ఉండేలా చూసుకోవాలని కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మనీషా, సూర్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తపాలాశాఖ ఆధ్వర్యంలో ఫిలాటెలీ ప్రదర్శన

ఖమ్మం మామిళ్లగూడెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) :తపాలాశాఖ ఖమ్మం డివిజన్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో ఫిలాటెలీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా తపాలా శాఖ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి తెలిపారు. ఖమ్మంలో ఎన్నెస్పీ క్యాంపులోని డీపీఆర్సీ భవనంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం జిల్లా స్థాయిలో ఫిలాటెలి ప్రదర్శన నిర్వహించనున్నట్లు శనివారం ఆయన తెలిపారు. స్టాంపులు సేకరణను ఒక ఆసక్తికరమైన అలవాటుగా ప్రోత్సహించడం కోసం ఈ పోటీలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఫిలాటెలి పై ఆసక్తి వున్నవారికోసం వర్క్ షాపులు, సెమినార్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనలో ప్రత్యేక 'మై స్టాంప్' కౌంటర్ ఏర్పాటు (మై స్టాంప్ ద్వారా తమకు ఇష్టమైన వారి ఫొటోలు, ఇష్టమైన చిత్రాలను భారతదేశంలో ఉపయోగించే స్టాండర్డ్ పోస్టేజ్ స్టాంప్‌తో ముద్రించుకునే వీలుంటుందని తెలిపారు. ఈ రెండు రోజుల్లో పాఠశాల విద్యార్థుల కోసం చిత్రలేఖనం, లెటర్ రైటింగ్, క్విజ్ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు.

ఎంట్రీ ఫారాలు తపాలా కార్యాలయాల సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్, ఖమ్మం 507003, ఖమ్మం కొత్తగూడెం, భద్రాచలం ప్రధాన తపాలా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన ఔత్సాహిక ఫిలాటెలిస్టులు తమ సేకరణలను ఆయా తపాలా కార్యాలయాలకు ఈనెల 24లోగా పంపించాలని ఎస్పీ వీరభద్రస్వామి తెలిపారు.

బీసీ నేతలకు 'అధ్యక్ష' పదవులు!

» ఖమ్మం డీసీసీ అధ్యక్షుడిగా నూతి సత్యనారాయణ, భద్రాద్రి అధ్యక్షురాలిగా తోట దేవీ ప్రసన్న

» ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా దీపక్‌చౌదరి

» జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవుల ఎంపికపై వీడిన ఉత్కంఠ

ఖమ్మం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) / కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ / వైరా : బీసీ నేతలకు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల చీఫ్ పదవులు దక్కాయి. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నూతి సత్యనారాయణను నియమించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆశీస్సులతో సత్యనారాయణ (బీసీ)కి ఈ పదవి వచ్చింది. గతంలో కూడా భట్టి విక్రమార్క అనుచరుడిగా ఉన్న వైరాకు చెందిన పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సుదీర్ఘకాలం పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి బాధ్యతలు చేపట్టారు. ఐతం సత్యం జిల్లా అధ్యక్షుడిగా చనిపోయిన తర్వాత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్ బాధ్యతలు చేపట్టి ఆ పదవిలో కొనసాగుతూ వస్తున్నారు. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి భట్టి సిఫార్సుతో సత్యనారాయణకు పదవి లభించినట్టు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి వైరాకు చెందిన నూతి సత్యనారాయణ డిగ్రీ చదివారు. యువజన కాంగ్రెస్ పార్టీలో ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ వస్తున్నారు. వైరా రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అనుచరుడిగా గుర్తింపు సాధించారు. 1995లో వైరా పంచాయతీ వార్డుసభ్యుడిగా గెలిచారు. భట్టి పాదయాత్రలో ఆయన వెంట నడిచారు. బీసీ వర్గానికి చెందిన సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా ఉండడం వివాద రహితుడిగా ఉండడంతో.. ఆయనకు పదవి లభించింది. ఖమ్మం నగర అధ్యక్షుడుగా నాదెండ్ల దీపక్‌చౌదరి జిల్లా కేంద్రం ఖమ్మం, నగర అధ్యక్షుడుగా సీనియర్ నేతకు అవకాశం లభించింది. నాయకులు, కార్యకర్తల అభిప్రాయసేకరణలో దీపక్ చౌదరికి మొగ్గు చూపించారు. దీంతో ఏఐసీసీ దీపక్‌చౌదరికి పగ్గాలు అప్పగించింది. గత కమిటీలో కూడా వర్కింగ్ ప్రెసిండెంట్‌గా దీపక్‌చౌదరి కొనసాగారు. ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉమ్మడి రాష్ట్ర పీసీసీలో రాష్ట్ర కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా పనిచేశారు. గతంలో ఖమ్మం కార్పొరేషన్ కార్పొరేటర్‌గా వ్యవహరించారు. ఇప్పుడు నగర అధ్యక్షుడిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశీస్సులు ఆయనకు లభించాయి. సీనియర్ కాంగ్రెస్ నేతకు ఖమ్మం నగర కాంగ్రెస్ బాధ్యతలు లభించడం పట్ల నగర కాంగ్రెస్‌లో హర్షం వ్యక్తమవుతోంది.

● **భద్రాద్రి కొత్తగూడేనికి దేవీ ప్రసన్న**

భద్రాద్రి కొత్తగూడెంజిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా బీసీ మహిళకు అవకాశం లభించింది. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న తోట దేవీప్రసన్న కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిలర్‌గా, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కూడా పని చేశారు. కాంగ్రెస్ అన్నివర్గాలతో సంబంధం కలిగిన దేవీ ప్రసన్న రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వర్గీయురాలిగా కొనసాగుతున్నారు. మంత్రి పొంగులేటి ఆశీస్సులు కూడా ఆమెకు లభించడంతో.. పదవి లభించేందుకు అవకాశం కలిగింది. మొత్తమ్మీద జిల్లాలో ముగ్గురు కాంగ్రెస్ సీనియర్‌లకు పార్టీలో పదవులు లభించాయి.

● **భట్టి విక్రమార్క నమ్మకాన్ని నిలబెడతా..**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన నూతి సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామక జాబితా వెలువడిన వెంటనే శనివారం రాత్రి వైరాలోని నూతి సత్యనారాయణ ఇంటి వద్ద కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. భర్త సత్యనారాయణకు భార్య విజయరాణి కేక్ తినిపించి ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా నూతి మాట్లాడుతూ.. భట్టి విక్రమార్క సారధ్యంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి మరింత కృషిచేస్తానని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోనని చెప్పారు. భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నూతి కృతజ్ఞతలు తెలిపారు.

పనిభారాన్ని తగ్గించాలని నిరాహార దీక్ష

మణుగూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మణుగూరు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కార్మికులపై యాజమాన్యం అదనపు పనిభారాన్ని విధించడాన్ని నిరసిస్తూ శనివారం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో మణుగూరు డిపో ఎదుట రిలే నిరహార దీక్షలను చేపట్టారు. జేఏసీ కార్మికులు దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోటార్ వెహికిల్ యాక్టుకు వ్యతిరేకంగా కార్మికులపై పనిభారాన్ని పెంచాలని యాజమాన్యం చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. మణుగూరు నుంచి గోదావరిఖని వెళ్లే సర్వీసును మంచిర్యాల వరకు పొడిగిస్తూ కార్మికులపై అదనపు భారాన్ని విధిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి టీఎస్ రావు, టీఎంపీ డిపో సెక్రటరీ రాహుల్ చారి, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి పవన్ కుమార్ పాల్గొన్నారు.

జీవో నెంబరు 44 పై కేసు ఉపసంహరణ

ఖమ్మం మార్కెట్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ ఉద్యోగుల ఏకీకృత యూనిఫామ్ పాలసీకి సంబంధించిన 2022లో ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబరు-44పై జిల్లాలోని పీఏసీఎస్ సంఘ కార్యదర్శులు హైకోర్టులో ఫైల్ చేసిన కేసును ఉపసంహరించుకున్నారని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సుమారు 100 సంఘాలు బాధ్యులు జీవో నెంబరు 44ను అమలుపరుచుటకు అంగీకరించి ఎంవోయూ చేసుకున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులకు ధన్యావాదాలు తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం హర్షం వ్యక్తం చేశారని ఆయన తెలిపారు.

ఏదీ.. అభయహస్తం?

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించింది. 18-59 సంవత్సరాల మధ్య ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులు రోజుకు రూపాయి చొప్పున నెలకు 30 రూపాయలను ఈ పథకంలో పొదుపు చేయాలని, అలా పొదుపు చేసిన సొమ్ము నుంచి 60 ఏళ్ల పూర్తయిన సభ్యురాలికి ఆమె చేసిన పొదుపును బట్టి ప్రతి నెలా పింఛన్‌ను చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2016 సంవత్సరం వరకు కొనసాగిన ఈ పథకంలో దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 21 లక్షల మంది మహిళా సంఘ సభ్యులు ఈ పథకంలో సభ్యులుగా చేరి నెలకు రూ.30ల చొప్పున చెల్లించారు. అప్పటికే 59 ఏళ్లకు దగ్గరగా ఉన్న సభ్యుల నుంచి వేలల్లో పొదుపు చేయించారు. ఈ విధంగా మహిళలు పొదుపు చేసిన సొమ్ము పథకం రద్దు అయ్యే సమాయానికి దాదాపు రూ.1600కోట్లుకు పైగా ఉంటుందని అంచనా. అలాగే ఉమ్మడి జిల్లాలో 2లక్షల మంది సభ్యులు మహిళా సంఘ సభ్యులు ఈ పథకంలో సభ్యులుగా ఉన్నారు. వీరికి ఇప్పటికీ రావాల్సిన నగదు రూ. 150 కోట్లకు పైనే ఉంది. అంతేకాదు ఈ పథకంలో చేరిన మహిళలకు జనశ్రీ బీమా పథకం ద్వారా సహజ మరణానికి రూ.35వేలు, ప్రమాదంలో మరణిస్తే రూ.75వేలు, శాశ్వత అంగవైకల్యానికి రూ.75వేలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.37,500ల చొప్పున చెల్లిస్తామని ఆ పథకంలో పొందుపరిచారు. అంతేకాదు శిక్షసహయోగ్ యోజన పథకం ద్వారా సభ్యుల సంతానం 8,9,10 తరగతులతో పాటు ఇంటర్, ఐటీఐ చదివే పిల్లలకు ఏడాదికి రూ.1200లు స్టైఫండ్‌గా చెల్లించేవారు. బహుళ ప్రయోజనాలు కలిగిన ఈ పథకం ద్వారా అప్పట్లో ఎంతో మంది మహిళలకు లబ్ధి చేకూరింది. ఎన్నో కుటుంబాలు బీమాతో పాటు ఉపకార వేతనాలను పొందాయి.

● 2018లో పథకాన్ని రద్దు చేసిన ప్రభుత్వం

2018 వరకు అమలులో ఉన్న అభయహస్తం పథకాన్ని ప్రత్యేక తెలంగాణ వచ్చిన తరువాత అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. తెలంగాణ వచ్చిన తరువాత 60 ఏళ్లు దాటిన వృద్ధులకు రూ.1000లు ఇస్తున్నందు వల్ల ఈ పథకం అవసరం లేదంటూ అభయహస్తంను పూర్తిగా రద్దు చేసింది. ఈ పథకం రద్దు వల్ల తక్కువగా పొదుపు చేసుకున్నవారికి ఫరవాలేదు కానీ పింఛన్ ఎక్కువ రావాలనే ఉద్దేశ్యంతో ఎక్కువ మొత్తంలో పొదుపు చేసుకున్న వారికి తీవ్రంగా నష్టం వాటిల్లింది. అదే విధంగా చాలా మంది మధ్యలోనే మరణించారు. కొందరికి ఈ పింఛన్లు మంజూరు కాలేదు. ఫలితంగా ఈ పథకానికి అనుబంధంగా అమలు చేస్తున్న బీమా, ఉపకార వేతనాల ప్రయోజనాలను కోల్పోయారు. ఇవన్నీ ఒక ఎత్తయితే తెలంగాణలో అప్పటివరకు ఈ పొదుపు పథకంలో చేరిన 21 లక్షల మంది మహిళలు పొదుపు చేసుకున్న రూ.1600కోట్ల సొమ్మును మహిళలకు తిరిగి చెల్లించే ఏర్పాటు చేయలేదు. మహిళలు పొదుపు చేసుకున్న కోట్లాది రూపాయల సొమ్మును ప్రభుత్వం తిరిగి చెల్లించకుండా నిలువునా మోసగించింది. రూపాయి రూపాయి కూడబెట్టుకొని రెక్కలు ముక్కలు చేసుకొని పొదుపు చేసుకున్న పేద మహిళల సొమ్మును ఆనాటి ప్రభుత్వం చెల్లించలేదు. పొదుపు చేసిన మహిళలు ఎంతగా రోదించినా.. దీనిపై స్పందించిన వ్యక్తులు, సంఘాలు, కోర్టులు ఎవ్వరూ లేరు. ఈ నేపథ్యంలో పొదుపు చేసిన సొమ్మును వడ్డీతో తిరిగి చెల్లించాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

అభయహస్తం సొమ్ములు వడ్డీతో చెల్లిస్తామన్నారు.. కానీ !?

2023లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అభయహస్తం పథకంలో మహిళలు పొదుపు చేసిన సొమ్ములను వడ్డీతో కలిపి చెల్లిస్తామని, వీటికి సంబంధించిన నివేదికను తయారు చేస్తున్నట్టు 2024, ఫిబ్రవరిలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ ప్రకటన లక్షలాది కుటుంబాల్లో ఆశలు రేకెత్తించింది. ఫలితంగా రాష్ట్రంలోని 21 లక్షల మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని అందరూ భావించారు. ఈ ప్రకటన వచ్చి దాదాపు ఏడాదిన్నర అయ్యింది. కానీ ఇప్పటివరకు ఆ ప్రకటన అమలులోకి రాలేదు. మహిళల పొదుపు సొమ్ములను చెల్లించనూ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం తాము చేసిన ప్రకటనను అమలు చేసి.. ఆ సొమ్ము ను తమకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత కుటుంబాలు కోరుతున్నాయి.

దోపిడీదారులు, దళారులను దగ్గరకు రానివ్వం

(5వ పేజీ తరువాయి)

అనుగుణంగా విద్యార్థులకు 40శాతం డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచామని భట్టి తెలిపారు. వైరా నియోజకవర్గానికి తమ ప్రభుత్వం ఒక్కరోజులోనే రూ.400కోట్లు నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులకు భూమిపూజ చేపట్టామని వివరించారు. ఈ అభివృద్ధి ఆరంభం మాత్రమేనని.. మున్ముందు నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. వైరా నియోజకవర్గంతో తనకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉందని.. ప్రతీ ఊరు, ప్రతీ మనిషి సమస్యలు తనకు తెలుసునన్నారు. తన రాజకీయ జీవితం కూడా ఈ నియోజకవర్గం నుంచే ప్రారంభమైందని గుర్తుచేశారు. అనంతరం మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులతో పాటు చీరలను భట్టి విక్రమార్క పంపిణీ చేశారు. ఆ తర్వాత ఇంటిగ్రేటెడ్ స్కూల్ నమూనాను పరిశీలించారు. అంతకు ముందు వైరాలో భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ శ్రేణులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. వైరాలోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ ఊరేగింపుతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కపై పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల, గిడ్డంగుల సంస్థల చైర్మన్లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఆత్మకమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ బోళ్ల గంగారావు, మునిసిపల్ చైర్మన్, మాజీ వైస్‌చైర్మన్ సూతకాని జైపాల్, ముళ్లపాటి సీతారాములు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణపై అధ్యయనం

(5వ పేజీ తరువాయి)

కల్వర్టును నిర్మించాలని కోరారు. అనంతరం బొజ్జిగుప్పలోని స్వయం సహాయక సంఘాలు, గ్రూపు లీడర్లను కలిసి బృందం సభ్యులు మాట్లాడారు. గ్రూపులు నడిపించే విధానం, రుణాలు తీసుకొని తిరిగి చెల్లించే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొజ్జిగుప్పలోని పర్యాటక కేంద్రాన్ని పరిశీలించారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలపై వివరాలను సేకరించారు. ఆదివాసీలు జరుపుకునే పండుగలు, పండించే పంటలు, తినే ఆహారం, జీవన విధానాలను అడిగి తెలుసుకున్నారు. వనమూలికలు పండించే ప్రదేశాన్ని పరిశీలించారు. ఆదివాసీ మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యంచేశారు. ఇండియా హౌస్ ప్రతినిధులు మురళి, జాహ్నవి, సోనాల్‌గాడ్గి, ఎంపీడీవో వివేక్‌రాం, డీటీ భరణిబాబు, ఏపీఎం జగదీష్, ఆర్ఐ కె.వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు పాల్గొన్నారు.

ఉపాధిలో ఆమెదే పైచేయి

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాల్లో వీరే అధికంగా ఉంటున్నారు. హాజరు సమయానికి పని పూర్తయిన తరువాత వెళ్లడం, ఇతర నిబంధనలను కూడా మహిళా కూలీలే ఎక్కువగా పాటిస్తున్నారు. టీఏలు సూచించిన కొలతల ప్రకారం పనులు పూర్తిచేస్తున్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం.. ఏడాదిలో ఒక కుటుంబానికి 100రోజులు మాత్రమే పనులు ఉంటాయి. 100 రోజుల పని పూర్తయిన తర్వాత మళ్లీ వచ్చే ఏడాది వార్షిక సంవత్సరం ప్రారంభం నాటికి పనుల కోసం నిరీక్షించాల్సి ఉంటుంది. ప్రస్తుతం 385కుటుంబాలు వంద రోజుల పని దినాలను పూర్తి చేసుకున్నాయి. వీరంతా మళ్లీ పనికి వెళ్లాలంటే.. వచ్చే ఏడాది ఏప్రిల్ 1వరకు ఆగాల్సిందే. ఈవిధంగా క్రమం తప్పకుండా పనులకు వచ్చే మహిళలకు త్వరగా ఉపాధి పని దినాలు అయిపోతున్నాయి. ఇలాంటి వారికోసం 150రోజులు పనులు కల్పించాలనే డిమాండ్ గతం నుంచే వినిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు వంద రోజులు పూర్తయిన వారికి పని కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లా ఉపాధి వివరాలు ఇలా..

మొత్తం కుటుంబాలు	2,22,000
మొత్తం కూలీలు	4,53,273
మొత్తం మహిళలు	2,31,129
మొత్తం పురుషులు	2,22,144
యాక్టివ్ కూలీలు	2,17,674
యాక్టివ్ మహిళలు	1,20,527
యాక్టివ్ పురుషులు	97,147

రిజర్వేషన్ రివర్స్!

(5వ పేజీ తరువాయి)

తగ్గడంతో గతంలో బీసీలకు కేటాయించిన తండాలు జనరల్ అయ్యే పరిస్థితి ఉండడంతో.. గిరిజనులు కూడా పోటీచేసే అవకాశం లభించనుంది. దీంతో అదృష్టాలు ఒక్కసారిగా తారుమారవుతున్నాయి. ప్రస్తుత రిజర్వేషన్ల ప్రకారం 50శాతం లోబడి రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించబోతున్నందున బీసీ రిజర్వేసన్ 42శాతం నుంచి తగ్గించారు. దీంతో బీసీలకే కేటాయించిన సీట్లు పలుచోట్ల జనరల్ కానున్నాయి.

● ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలం మంగలితండాలో 829మంది ఓటర్లు పూర్తిగా గిరిజనులే. అక్కడ గత నోటిఫికేషన్‌లో బీసీ మహిళకు రిజర్వేషన్ చేశారు. బానోత్ అనిత అనే ఒక బీసీ మహిళ ఆ తండాకు చెందిన గిరిజన యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుని హైదరాబాద్‌లో రోజువారీ పని చేసుకుంటోంది. బీసీ మహిళకు ఆ తండా రిజర్వ్ కావడంతో ఆమెను అప్పటికప్పుడు కూసుమంచికి రప్పించి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా పార్టీలోకి రప్పించి కండువా కప్పారు. బీసీ మహిళకు ఈ పదవి గ్యారంటీ అనుకున్నారు. అయితే ఇప్పుడు తాజా రిజర్వేషన్లలో మంగలితండా జనరల్‌గా మారే అవకాశం ఉంది. దీంతో గిరిజనులే అక్కడ నేరుగా పోటీ చేసే అవకాశం లభించనుంది. బీసీ మహిళ కావడంతో గతంలో పోటీ చేసే అవకాశం గిరిజనులకు లేదు. జనరల్ కావడంతో ప్రస్తుతం అందరికీ పోటీ చేసే అవకాశం దక్కనుంది. ఇక్కడ గిరిజనుల ఓట్లు ఎక్కువగా ఉన్నందు వల్ల ప్రస్తుతం వారే పోటీ చేసే అవకాశం ఉంది.

● కూసుమంచి మండలంలోని ధర్మాతండాలో గత నోటిఫికేషన్‌లో బీసీ జనరల్ చేశారు. ఈతండాలో కూడా అంతా గిరిజన ఓటర్లే. అయితే ఇక్కడ కుమ్మరికుంట్ల నాగరాజు అనే వ్యక్తి పక్కనే ఉన్న కేశ్వాపురం గ్రామం నుంచి తన భార్యతో కలిసి వచ్చి ధర్మాతండాలో నర్సరీ నడుపుతున్నాడు. నాగరాజు ఒక్కరే బీసీ జనరల్ ఓటరుగా ఉండడంతో ఆయనకు సర్పంచ్ పదవి గ్యారంటీ అనుకున్నారు. ఆయనకే టికెట్ ఇవ్వాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఈ పదవి ఇప్పుడు జనరల్ అయ్యే అవకాశం ఉంది. దీంతో గిరిజన ఓటర్లే అధికంగా ఉన్నందు వల్ల తండావాసులు సర్పంచ్‌గా పోటీ చేయనున్నారు. ఎస్సీ ఎస్టీ రిజర్వ్‌డ్ సర్పంచ్ పదవులు ఉన్నచోట పెద్ద మార్పులు లేకపోవడంతో ఒక్కరు ఓటరున్నచోట కూడా వారికి సర్పంచ్ పదవి దక్కే పరిస్థితి ఉంది. చింతకాని మండలం రాఘవాపురంలో ఎస్సీ మహిళకు రిజర్వ్ కాగా.. మళ్లీ అదే రిజర్వేషన్ అమలవుతున్నందు వల్ల అక్కడ ఇద్దరే ఎస్సీ ఓటర్లు ఉన్నారు. ఇద్దరు తల్లీ కొడుకులే. దీంతో తల్లికి సర్పంచ్ పదవి దక్కనుంది.

● ఏన్కూరు మండలంలోని నూకాలంపాడు పంచాయతీ షెడ్యూల్ ఏరియాలో ఉంది. అక్కడ సర్పంచ్ పదవి ఎస్టీ మహిళకు రిజర్వ్ అయ్యింది. అయితే గ్రామంలో మొత్తం ఓసీ, బీసీ, ఎస్సీ ఓటర్లే ఉన్నారు. ఎస్టీ ఓటర్లు లేరు. ఇక్కడ సర్పంచ్ పదవితో పాటు నాలుగు వార్డులు కూడా ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. దీంతో ఇక్కడ సర్పంచ్ పదవికి వార్డు పదవులకు నామినేషన్లు పడే అవకాశం లేదు ఇక్కడ ఉపసర్పంచ్ సర్పంచ్‌గా గత కొన్నేళ్లుగా కొనసాగుతున్నారు. ఈసారి కూడా అదే ఆనవాయితీ రానుంది.

● రఘునాథపాలెం మండలం రాములు తండా గత నోటిఫికేషన్‌లో సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ అయ్యింది. బీసీ మహిళ ఒక్కరే ఉండడంతో సర్పంచ్ పదవి ఆమెకు అనుకున్నారు వాస్తవానికి ఈపంచాయతీ ఓటర్లంతా గిరిజనులే. ఇప్పుడు అది జనరల్ కావడంతో గిరిజనులు జనరల్ స్థానంలో పోటీచేసి సర్పంచ్ పదవి దక్కించుకోనున్నారు.

● పెనుబల్లి మంలం ఉప్పలచలక పంచాయతీ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్నందు వల్ల ఈ పంచాయతీ ఎస్టీకి రిజర్వు అయింది. ఇక్కడ ఒక్క కుటుంబం మాత్రమే ఎస్టీ ఓటర్లున్నారు. అందులో ముగ్గురికి ఓట్లు ఉండగా.. ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఆ ఇంటిలో రుద్రజారాణి అనే యువతి ఒక్కరే సర్పంచ్‌గా పోటీ చేసి ఏకగ్రీవంగా సర్పంచ్‌ను దక్కించుకోనున్నారు. గతంలో కూడా ఈమె సర్పంచ్.

భద్రాద్రి జిల్లాలో నేడు తేలనున్న రిజర్వేషన్లు

జిల్లాలో 471 పంచాయతీలు.. 4168 వార్డులు
ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు, సిబ్బంది



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయతీ కార్యాలయం ఇదే..

చుంచుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గ్రామ పంచాయతీ రిజర్వేషన్లు ఆదివారం తేలనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల విధి, విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేస్తూ జీవో నెంబరు 46ను శనివారం విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రిజర్వేషన్లు మొత్తం 50శాతానికి మించకుండా అమలు చేయాలని స్పష్టంచేస్తూ ప్రభుత్వం ఆ జీవోలో పేర్కొంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను అమలు చేసే విధానాన్ని స్పష్టంగా వివరించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాల్లో రిజర్వేషన్లు అమలవుతాయని చెప్పింది.

జిల్లాలో 471 పంచాయతీలు.. 4168 వార్డులు

భద్రాద్రి జిల్లాలో 471 పంచాయతీలు.. 4168 వార్డులు ఉన్నాయి. సర్పంచ్‌లకు సాధారణ రిజర్వేషన్ కోసం 2011 జనగణన ఆధారంగా.. వార్డు సభ్యులకు 2024 కులసర్వే ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలన్న నిబంధనలు ఉంచారు. బీసీ సర్పంచ్ పోస్టులకు 2024 కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్ అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులు, సిబ్బంది రిజర్వేషన్లు చేపట్టే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. మహిళలకు అన్ని కేటగిరిల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు 50శాతం వరకు రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత పంచాయతీ ఎన్నికల్లో (2019) ఏ కేటగిరీలకు రిజర్వేషన్లు కేటాయించారో.. ఆ కేటాయింపులను పరిగణనలోకి తీసుకొని తాజా రొటేషన్ ప్రకారం కొత్త రిజర్వేషన్లను అమలు చేయాలని ఆ జీవోలో పొందుపరిచారు.

ఆర్టీసీ కార్మికుల భూమి అన్యాక్రాంతం!

ఆర్టీసీ డిపో ఎదుట ఏపీఎస్ ఆర్టీసీ యూనియన్ నాయకుల భారీ నిరసన
పాల్గొన్న యూనియన్ నేతలు, విశ్రాంత ఉద్యోగులు
సంఘీభావం తెలిపిన ఇతర యూనియన్ నేతలు

ఖమ్మం డిపో ఎదుట ఉన్న రూ.2 కోట్ల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయాలి



బస్ డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికుల విరాళాలతో కొనుగోలు చేసిన రూ. రెండు కోట్ల విలువ చేసే భూమి, భవనాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోని భవనాన్ని సంఘానికి అప్పగించాలని కోరుతూ శనివారం ఏపీఎస్ ఆర్టీసీ ఎన్ఎంయూ యూనియన్ నేతలు, విశ్రాంత ఉద్యోగులు ఖమ్మం ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన నిర్వహించి ధర్నా చేశారు. ఆర్టీసీలోని ఇతర సంఘాల నేతలు సైతం వీరికి సంఘీభావంగా నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ రీజినల్ సెక్రటరీ ఆర్‌వీ.వీరభద్రం, నాయకులు ఆర్ఎస్.రామారావు, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ చీఫ్ వైస్‌ప్రెసిడెంట్ ఎస్.పాండురంగారావు, ఎన్ఎంయూ మాజీ రీజినల్ సెక్రటరీ, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ స్టేట్ సెక్రటరీ వీ.చక్రధర్‌రావు, రిటైర్డ్ ఎంప్లాయీస్ రీజినల్ ప్రెసిడెంట్ బీవీ.రావులు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002 కార్మికులకు, యూనియన్ నాయకులకు, ఉద్యోగులకు విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉండాలని ఖమ్మం డిపో ఎదుట 350 గజాల భవనాన్ని యూనియన్ పేరిట కొనుగోలు చేశామని, నాటి నుంచి ఓ గదిలో యూనియన్ ఆఫీస్ కొనసాగుతుందన్నారు. యూనియన్‌లోని ఇద్దరు నాయకులు (విశ్రాంత ఉద్యోగులు) సుమారు 210 గజాల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ నేతలు వారిపై న్యాయపోరాటం చేస్తూనే తాజాగా వారు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డుకున్నామన్నారు. ఈ నేపథ్యంలో శనివారం వారు ఆందోళన చేపట్టామన్నారు. ఈ భవన అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఆఫీస్ అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. కార్మిక యూనియన్ ద్రోహులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మిక విరాళాలతో నిర్మించుకున్న ఆఫీసును అక్రమార్కుల నుంచి కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు, ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూ నాయకులు, ఎంప్లాయీస్ యూనియన్, టీఎంయూ నాయకులు, పాల్గొన్నారు.

నేటి నుంచి నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రవేశ పరీక్ష

డీఈవో నాగలక్ష్మి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం నుంచి పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో ఈ పరీక్షకు 758 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని కొత్తగూడెం పట్టణంలోని బాబుక్యాంపు ఉన్నత పాఠశాల, చుంచుపల్లి ఉన్నత పాఠశాల, సింగరేణి ఉన్నత పాఠశాలల్లో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ఆదివారం ఉదయం 8.30 గంటలకు హాజరుకావాలని కోరారు. సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్స్ డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం ప్రభుత్వ పరీక్షల సహాయం కమిషనర్ ఎస్.మాధవరావుని సంప్రదించాల్సిందిగా డీఈవో తెలిపారు.

డీడబ్ల్యూవోగా బాధ్యతలు స్వీకరించిన విజేత



ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారిగా శనివారం వేల్పుల విజేత ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని మహిళా ప్రాంగణం అధికారి వేల్పుల విజేతను డీడబ్ల్యూవోగా నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయగా ఆమే శనివారం డీడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. నూతన డీడబ్ల్యూను కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

5 తేదీలోగా టెక్నికల్ కోర్సు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 2026 విద్యా సంవత్సరంలో నిర్వహించే టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు లోయర్, హైయర్ గ్రేడులకు డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాడరీ పరీక్షల రుసుం డిసెంబరు 5లోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్యజైని శనివారం ఒక ప్ర కటనలో తెలిపారు. రూ.100 పరీక్ష ఫీజును చెల్లించాలని తెలిపారు. రూ.50 అపరాద రుసుంతో డిసెంబరు 12 వరకు, రూ. 75 అపరాద రుసుంతో డిసెంబరు 19 వరకు చెల్లించవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

గొర్రెల కాపరి నుంచి డాక్టరేట్ దాకా..!

ఆదివాసీ విద్యార్థి విజయగాథ



ప్రొఫెసర్ విష్ణుదేవ్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న పాపారావు

ఏన్కూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం కేసుపల్లి గ్రామానికి చెందిన ఆదివాసి యువకుడు సాగనబోయిన పాపారావు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందాడు. ఈమేరకు శనివారం సోషియాలజీ విభాగ అధిపతి ప్రొఫెసర్ పి.విష్ణుదేవ్ చేతులమీదుగా పట్టా అందుకున్నారు. సోషియాలజీలో గిరిజన అభివృద్ధి, ఉపప్రణాళిక, ఐటీడీఏ భద్రాచలం సామాజికశాస్త్ర అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను డాక్టరేట్ పొందాడు. ఓయూ చరిత్రలో సోషియాలజీ విభాగంలో ఆదివాసీ యువకుడు డాక్టరేట్ పొందడం ఇదే ప్రథమం. తల్లిదండ్రులు పుల్లయ్య, కమలమ్మలు నిరు పేదలు. ప్రాథమిక విద్యాభ్యాసం ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు స్వగ్రామంలో చదివాడు. ఆర్థిక ఇబ్బందులతో హైస్కూల్ చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టాడు. అనంతరం గొర్రెల కాపరిగా కొంతకాలం పనిచేశాడు. ఆతర్వాత చదువుపై ఆసక్తితో ఓపెన్‌టెన్త్ పూర్తిచేసి హైదరాబాదు వెళ్లాడు. అక్కడ పార్టుటైం ఉద్యోగాలు చేస్తూ ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాడు. ఆ తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ చేశాడు. అదే యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన పాపారావును తెలంగాణ రాష్ట్ర హెరిటేజ్ ఆర్కియాలజీ మ్యూజియం డైరెక్టర్ ప్రొఫెసర్ కుతాడి అర్జున్‌రావు, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఖాసీం, ఓయూ సీడీసీ డీన్ ప్రొఫెసర్ రేగా రాజేందర్ అభినందించారు.

జాతీయస్థాయి క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులను అభినందించిన సీఎం



జాతీయస్థాయి క్రీడల్లో సత్తాచాటిన టేకులపల్లి ఈఎంఆర్ఎస్ విద్యార్థులను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

టేకులపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి సత్తాచాటిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యార్థులను శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఒడిస్సా రాష్ట్రంలో ఈ నెల 11 నుంచి 15 వరకు 5వ జాతీయ స్థాయి ఈఎంఆర్ఎస్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో టేకులపల్లి ఈఎంఆర్ఎస్ విద్యార్థులు వాలీబాల్ ప్రథమ బహుమతి, జూడోలో వి.రఘు, జి.చరణ్, టైక్వాండో విభాగంలో కె.సాయిచరణ్, స్విమింగ్ విభాగంలో పి.కిరణ్‌నాయక్‌లు గోల్డ్‌మెడల్ సాధించారు. స్విమింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించిన పాల్తియా కిరణ్‌నాయక్ పూనేలో జరుగనున్న ఖేలో ఇండియా క్రీడల్లో పాల్గొనే అర్హత సాధించాడు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అభినందించి, బెస్ట్ ఎక్స్‌లెంట్ చాంపియన్‌షిప్ అవార్డులను అందజేశారు.

బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నారన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా ఖమ్మంలో శతాబ్ది ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ 26 నాటికి కమ్యూనిస్టు పార్టీకి వందేళ్లు పూర్తి జరుగుతాయని పార్టీ చరిత్రను వివరించారు. 40దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఖమ్మంలో నిర్వహించే సభకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేశ్, జమ్ముల జితందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

మోడీఫైడ్ సైలెన్సర్లను తొలగించిన పోలీసులు
ఆ ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు



సైలెన్సర్ నుంచి వస్తున్న మంటలను చూపుతున్న సీఐ సత్యనారాయణ

ఖమ్మం క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మోడీఫైడ్ సైలెన్సర్లను అమర్చిన ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను తొలగించి, జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా కొందరు యువకులు వాహనాలకు సంబంధిత సంస్థ ఇచ్చిన సైలెన్సర్లను మార్చుచేసి వింతశబ్దం, అగ్నిమంట వచ్చేవాటిని అమర్చి, రోడ్లపై అకస్మాత్తుగా వింత శబ్దాలు చేయడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం జరుగుతున్న నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా ఈరోజు 20 మోడిఫైడ్ సైలెన్సర్లను తొలిగించి ఒక్కో వాహనదారుడికి రూ.1000 జరిమానా విధించారు. ఇప్పటికే సుమారు 1000 మోడీఫైడ్ సైలెన్సర్లను తొలిగించడం జరిగిందని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో సీఐ బెల్లం సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలి

టీయూసీఐ నిరసన - లేబర్ కోడ్ జిరాక్స్ ప్రతుల దహనం

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల పాటు కార్మికులు అమరణ నిరాహారదీక్షలు, ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కుల చట్టాల్ని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోధి ప్రభుత్వం ఒక్క పెన్ను పోటుతో నిర్వీర్యం చేసి వాటి స్థానంలో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యాక్షులు జీ.రామయ్య ఆరోపించారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా టీయూసీఐ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలో బైపాస్ రోడ్డు నుంచి టేకులపల్లి వంతెన వరకు కార్మికులతో కలిసి భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం లేబర్ కోడ్ జీరాక్స్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా జీ రామయ్య మాట్లాడుతూ పెట్టుబడి వర్గాలకు అనుకూలంగా లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకొచ్చారని కార్మికులు తమ హక్కుల్ని కోల్పోయారని విమర్శించారు. కార్పొరేట్ శక్తులు పెట్టుబడితో ఇప్పుడు బీహార్ రాష్ట్రంలోను బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో కార్మిక వ్యతిరేక విదానాలు పెరుగుతాయని ఆరోపించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి వాటి స్థానంలో గతంలో అమలు చేసిన కార్మిక చట్టాలు తిరిగి అమలులోకి తీసుకరావాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్, నాయకులు కొయ్యల శ్రీనివాస్, ములకలపల్లి లక్ష్మీనారాయణ, కంకణాల శ్రీనివాస్, బొమ్మకంటి రమేశ్, వీరారెడ్డి, రామారాజు, తిరపయ్య, దాసు, శోభన్, సైదులు, బజారు, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా అవకతవకలపై డిప్యూటీ సీఎంకు మహిళల ఫిర్యాదు

విచారించాలని ఖమ్మం కలెక్టర్‌కు భట్టి ఆదేశం



డిప్యూటీ సీఎం భట్టికి ఫిర్యాదు చేస్తున్న మహిళలు

బోనకల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం (ఏ) గ్రామానికి చెందిన మహిళలు తమ గ్రామంలో డ్వాక్రా రుణాలకు సం బంధించి అవకతవకలు జరిగాయని తమకు న్యాయం చేయాలని శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు అధికారులపై ఫిర్యాదు చేశారు. బోనకల్‌లో డెయిరీ ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం ముగించుకొని మధిర వెళ్తున్న క్రమంలో మండలంలోని రాయనపేట వద్ద వేచి ఉన్న మహిళలను చూసి భట్టి కాన్వాయ్‌ను ఆపారు. అనంతరం కిందకు దిగి మహిళలతో మాట్లాడగా వారు తమ గోడును విన్నవించుకున్నారు. గత కొన్ని నెలలుగా తమ గ్రామంలో డ్వాక్రా గ్రూపులకు ఇచ్చిన రుణాలను వాయిదాలకు మించి కట్టించుకున్నారని వాపోయారు. ఇప్పటికే తాము పలుసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా, విచారణ పేరుతో కాలయాపన చేస్తూ దాటవేత ధోరణిని అవలంభిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరగా స్పందించిన భట్టి సమగ్ర విచారణ చేసి మహిళలకు న్యాయం చేయాల్సిందిగా ఖమ్మం కలెక్టర్‌ను ఆదేశించారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

మంత్రి తుమ్మలకు మహిళల వినతి



గ్రామ సమస్యలను మంత్రి తుమ్మలకు వివరిస్తున్న కొండరెడ్ల మహిళలు

దమ్మపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పూసుకుంట గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామానికి చెందిన కొండరెడ్ల మహిళలు శనివారం గండుగుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి విన్నవించారు. గ్రామంలో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవటంతో వ్యవసాయానికి నీరు లేదని, రహదారి నిర్మాణం పూర్తి కాకపోవటం ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పామాయిల్ మొక్కలు ఇప్పిస్తే తోటలు వేస్తామని కోరారు. సమస్యలపై స్పందించిన తుమ్మల ఐటీడీఏ పీవోతో ఫోన్ మాట్లాడి పూసుకుంట వాసుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ ఆధ్వర్యంలో తుమ్మలను కలిసి సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. పలు మండలాలకు చెందిన పలువురు వ్యక్తిగత సమస్యలపై వినతిపత్రాలు అందజేసారు. ఆయన వెంట పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్ర ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, మంగేశ్వరరావు ఉన్నారు.

రామరాజ్యం పేరుతో.. బీజేపీ రాక్షస పాలన

(5వ పేజీ తరువాయి)

ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ, విదేశాల నుంచి కవులు, కళాకారులు, మేధావి వర్గ ప్రతినిధులు ఈ సభలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, నలిగంటి శ్రీనివస్, చంద్ర నరేంద్ర, ఎసీ సీలం, కమటం వెంకటేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాస్, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, కంచర్ల జమలయ్య, అడ్డగర్ల తాతాజీ, ఉప్పుశెట్టి రాహుల్ పాల్గొన్నారు.

ఏఐబీఈ 2025 మాక్ టెస్ట్ విజయవంతం



మాక్ టెస్ట్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

ఖమ్మం లీగల్ నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్)ఖమ్మం జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఏఐబీఈ 2025 మాక్ టెస్ట్ ఖమ్మం నగరంలోని మానెర్ కాలేజ్ ఆఫ్ లాలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాసశర్మ, ప్రధాన పర్యవేక్షకుడు సోమశేఖరశర్మ, ఐఏఎల్ మహిళా కార్యదర్శి షేక్ నస్రీన్‌లు కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐబీఈ వంటి జాతీయస్థాయి పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు నిజమైన పరీక్ష వాతావరణాన్ని అందించడానికి మాక్ టెస్టులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. లా విద్యార్థుల అభివృద్ధి కోసం ఐఏఎల్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ మక్ టెస్టుకు 200 మందికి పైగా అభ్యర్థులు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా యువ న్యాయవాదుల పురోగతికి ఉపయోగపడే మరిన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సీనియర్ న్యాయవాదులు పారుపల్లి అమర్‌చంద్, కె.శరత్, ఎం.హనుమంతరావు, టి.వెంకటేశ్వర్లు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కేసులు నమోదు

భద్రాద్రి జిల్లా తూనికలు, కొలతల శాఖాధికారి మనోహర్

జూలూరుపాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడి రైతులను, ప్రజలకు నష్టం కలిగిస్తే కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారి కె.మనోహర్ తెలిపారు. తూకాల్లో వేబ్రిడ్జి యాజమానులు మోసం చేస్తున్నారని కొంతమంది రైతులు ఫిర్యాదు చేయడంతో శనివారం ఆయన జూలూరుపాడు, సుజాతనగర్‌లోని 7 వేబ్రిడ్జిలను తనిఖీ చేశారు. కంప్యూటర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఫిర్యాదు మేరకు వేబ్రిడ్జిలను తనిఖీ చేయడం జరిగిందని, జూలూరుపాడు, సుజాతనగర్‌లోని వేబ్రిడ్జిల కాటాలు ఒకే విధంగా ఉన్నాయని, ఎలాంటి తేడాలు లేవన్నారు. వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లయితే ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయాలని కోరారు. జూలూరుపాడులోని చేపలు, మాంసం విక్రయాల్లో, కిరాణ దుకాణాల్లో వ్యాపారులు తూకాల్లో తేడాలు చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని త్వరలోనే వాటిని కూడా తనిఖీ చేస్తామని, తేడాలు ఉంటే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



జూలూరుపాడులోని వేబ్రిడ్జిలో కంప్యూటర్‌ను, కాటాను తనిఖీ చేస్తున్న జిల్లా తూనికల, కొలతల శాఖ అధికారి మనోహర్

గిరిజన జనాభా దామాషా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలి

జీఎల్ఎస్ జేఏసీ భద్రాద్రి జిల్లా చైర్మన్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్



మాట్లాడుతున్న ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన జనాభా దామాషా ప్రతిపాదికన గిరిజనులకు రిజర్వేషన్లు అమలు చేయాలని గిరిజన లంబాడీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జీఎల్ఎస్ జేఏసీ) భద్రాద్రి జిల్లా చైర్మన్ ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ శనివారం డిమాండ్ చేశారు. కొత్తగూడెం క్లబ్‌లో జేఏసీ నిర్మాణం కోసం సమావేశం నిర్వహించి పూర్తిస్థాయి కమిటీని ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో 80శాతం గిరిజన జనాభా ఉంటే జీవో33 ప్రకారం 10శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దేశంలో రాజ్యాంగం అమలు కాకముందు నుంచి లంబాడీలు ఎస్టీలుగా గుర్తించబడి ఉన్నారని, స్వాతంత్ర్యం అనంతరం షెడ్యూల్ తెగలుగానే గుర్తించారని తెలిపారు. రాష్ట్రంలోని అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతం కావడం వల్ల స్థానిక ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారని, క్యాన్సర్ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. గోదావరి పరివాహక ప్రాంతమైన భద్రాద్రి జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీళ్లను ప్రతీ ఎకరాకు అందించాలన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన కమిటీలో గౌరవఅధ్యక్షుడు బోడాలాలునాయక్, సెక్రటరీ జనరల్ న్యాయవాది బానోత్ రమేష్‌నాయక్, వైస్ చైర్మన్‌లు లావుడియా ప్రసాద్‌నాయక్, గుగులోత్ రాజేష్, ప్రధాన కార్యదర్శులుగా హలవత్ రామారావు, గుగులోత్ దేవీలాల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

వారి వద్ద నుంచి 1.80 గ్రాముల ఎండుగంజాయి, స్కూటీ స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ మధు, ఎస్ఐ లక్ష్మీభార్గవి

మధిర రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురం క్రాస్‌రోడ్డు వద్ద స్కూటీపై గంజాయి తీసుకు వెళ్తున్న ముగ్గురు యువకులను పట్టుకొని తనిఖీ చేయగా వారివద్ద 1.80గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీంతో పోలీసులు వారి స్కూటీని స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసినట్టు రూరల్ సీఐ మధు, రూరల్ ఎస్ఐ లక్ష్మీ భార్గవి తెలిపారు. శనివారం మధిరలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మధిర మండం సిరిపురం క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం రూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బోనకల్ మండలం కలకోట గ్రామానికి చెందిన యంగల కార్తీక్, తోటపల్లి రాహుల్, తోటపల్లి కిరణ్ శేఖర్‌లు స్కూటీపై గంజాయి తీసుకొని కలకోట నుంచి సిరిపురం వైపు వస్తున్నారు. ఆ సమయంలో సిరిపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీల్లో భాగంగా వీరి ద్విచక్రవాహనాన్ని తనిఖీ చేయగా డిక్కీలో ఎండు గంజాయి లభ్యమైంది. వారి నుంచి వివరాలు చేకరించగా ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి.. వీరు తాగడంతో పాటు వేరే వాళ్లకు అమ్ముతుంటారు. గంజాయితోపాటు సెల్‌ఫోన్, స్కూటీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ మధు, ఎస్ఐ లక్ష్మీభార్గవి తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్

తృటిలో తప్పిన పెను ప్రమాదం - ప్రయాణికులు సురక్షితం



ప్రమాదం తప్పిన బస్సు ఇదే..

బోనకల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మధిర క్రాసురోడ్డు సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టింది. ప్రయాణికులతో వస్తున్న బస్సుకు తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అందులో ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే వైరా నుంచి మధిర వైపు వస్తున్న పల్లెవెలుగు బస్సు క్రాస్‌రోడ్డు దాటుతున్న క్రమంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్లాంట్ పనులకు సంబంధించిన టిప్పర్ రోడ్డు ఎక్కుతూ బస్సు అంచును ఢీకొట్టింది. దీంతో ప్రయాణీకులు భయాందోళనకు గురయ్యారు. బస్సును రోడ్డు పక్కకు తీసి ఆపారు. ఇటీవల బస్సు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటంతో టిప్ప ర్ బలంగా ఢీకొట్టినట్లైతే పెను ప్రమాదం జరిగేదన్న చర్చ జోరుగా సాగింది.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి



నాగరాజు మృతదేహం

అన్నపురెడ్డిపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కట్టుగూడెం వద్ద శనివారం ట్రాక్టర్‌పై నుంచి పడి కట్టుగూడెం గ్రామానికి చెందిన పుప్పుల నాగరాజు(35) మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ విజయ్ సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కూలి పనికి వెళ్లిన నాగరాజు ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాస్తు జారిపడి మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ముదిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్దమండవ, గంధసిరి మున్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ముదిగొండ పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఇసుక రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు సీఐ మురళీ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ముగ్గురు యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మురళీ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మురళీ హెచ్చరించారు.

ఇసుక లారీలను పట్టుకున్న పోలీసులు

దమ్మపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీ నుంచి తెలంగాణలోని ఖమ్మం వైపుకు ఎలాంటి అనుమతులు లేకుండా మూడు ఇసుక లారీలు వెళుతుండగా దమ్మపేట పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రధాన రహదారి మందలపల్లి క్రాస్‌రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలను పోలీసులు గుర్తించారు. వాటిని దమ్మపేట స్టేషన్‌కు తరిలించగా ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి శనివారం కేసు నమోదు చేసారు.

వృద్ధురాలిని బెదిరించిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు

పాల్వంచ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని బెదిరించిన ఘటనలో ఆరుగురిపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పాల్వంచ మండలం బసవతారక కాలనీలో నివాసం ఉంటున్న ముంతాజ్ బేగంను అక్టోబరు 12వ తేదీన ఆమె చిన్న కుమారుడు రహమత్‌ఖాన్, అతని భార్య, ఆమె తరపు బంధువులు కలిసి దుర్భాషలాడటమే కాక చంపుతామని బెదిరించారు. ఆస్తి తమ పేరుపై రాయాలని ముంతాజ్ బేగంను బలవంతం చేశారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బెదిరింపులకు పాల్పడిని చిన్న కుమారుడు రహమత్‌ఖాన్, అతని భార్యతో పాటు మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఐటీహబ్ విస్తరణ జరపాలి

మంత్రికి విన్నవించిన తుమ్మల యుగంధర్

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలో విజయవంతంగా కొనసాగుతున్న ఐటీహబ్‌ను ఇంకా విస్తరించాలని ఐటీమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును యుగంధర్ కలిసి ఐటీహబ్ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు.



బకాయిలు చెల్లించక పోవడం సరికాదు

సీపీఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ హోదాల్లో సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన వారి బకాయిలను చెల్లించకపోవడం సరికాదని సీపీఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు.పెన్షనర్ల డిమాండ్ సమర్థనీయమైందని సమస్య పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం కూనంనేనికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. పెన్షనర్లు సాగించే ఆందోళనకు కమ్యూనిస్టు పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్,రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం,సంఘం బాధ్యులు గుర్రాల శ్రీనివాసరావు, పెదమాళ్ల సత్యనారాయణ,వల్లి కార్జున రావు,సుధాకర్,అన్నమ్మ, ఉమాదేవి,నాగలక్ష్మి, గడల భాస్కరావు. రహీముద్దీన్, లింగయ్య, మురళికృష్ణ, యుగంధర్ న్నారు. అనంతరం కొణిజర్ల గ్రామానికి చెందిన బీ-ఫార్మసీ విద్యార్థిని పి.ఉషారాణికి రూ.20వేల చెక్కును చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన బి-ఫార్మసీ విద్యార్థిని శ్రీరాం మానసకు రూ.20వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పరిశా పుల్లయ్యను అభినందించారు.

చింతగుర్తిలో మంత్రి తుమ్మల పూజలు



చింతగుర్తిలో పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతగుర్తి గ్రామంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారంరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో అయ్యప్పస్వాములు నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, వీవీపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, మాజీ సర్పంచి తమ్మినేని నాగేశ్వరరావు బండి నాగేశ్వరరావు,గ్రామశాఖ కార్యదర్శి సూతగాని గోపయ్య, కొత్త కోమరయ్య, కేశినేని సీతరామయ్య, గురుస్వాములు నీలకంఠి అప్పారావు,రఘు పాల్గొన్నారు.

తుమ్మలను కలిసిన 'చాంబర్' కొత్త కమిటీ

ఖమ్మంమార్కెట్: వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరావును శనివారం నగరంలోని క్యాంప్‌కార్యాలయంలో చాంబర్‌ఆఫ్‌కామర్స్ కార్యవర్గ సభ్యులు కలిశారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు కురువెళ్ళ ప్రవీణ్ కుమార్‌తో పాటు, ప్రధాన కార్యదర్శి జీవై నరేష్, ఉపాధ్యక్షుడు బత్తిన నర్సింహరావు, ట్రెజరర్ తల్లాడ రమేష్,సహాయ కార్యదర్శి బాదెరవి,సెంట్రల్ ఈసీసభ్యులు మాటేటి కిరణ్, రాయపుడి రవి, వంగవీటిహరీష్, పోట్లరామనాథం,అన్నిశాఖల అధ్యక్ష, కార్యదర్శులు కలిసి మంత్రి ఆశీర్వాదం తీసుకున్నారు. తుమ్మల వారిని శాలువాతో సత్కరించారు.

రిటైర్డు ఉద్యోగుల వినతి

ఖమ్మంచర్చికాంపౌండ్: రిటైర్డుప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు శనివారం రిటైర్డు ఉద్యోగులు వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బయ్య,ప్రధానకార్యదర్శి తాళ్లూరి వేణు ఇటీవల ఏర్పడిన జిల్లా కమిటీని మంత్రి తుమ్మలకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి రాయల వెంకటనారాయణ,ఉపాధ్యక్షుడుసాదినేని పూర్ణచంద్రరావు, ఉపేందర్‌రావు, ఖాజామోయినుద్దీన్, కృష్ణారెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన పంచాయతీల రిజర్వేషన్లు

నేడు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 571గ్రామపంచాయతీలకు 5214 వార్డులకు రిజర్వేషన్లు ఖరారు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శుక్ర, శనివారం రెండురోజుల పాటు జిల్లాఅధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నారు. శనివారం రాత్రి వరకు రిజర్వేషన్ల ప్రక్రియపై కసరత్తు చేస్తూనే ఉన్నారు. ఈ రాత్రికి ఓ కొలిక్కి వస్తే ఆదివారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గెజిట్‌నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదలయితే జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సగమం అవుతుంది. అధికార యంత్రాంగం సిద్ధం చేసిన ఈ రిజర్వేషన్ల వివరాలను రాష్ట్రప్రభుత్వానికి నివేదించి అక్కడి నుంచి. ప్రభుత్వం రాష్ట్రఎన్నికల సంఘానికి పంపిస్తే అన్ని జిల్లాల నుంచి రిజర్వేషన్ల ప్రక్రియ నివేదికలను అందగానే నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. దాదాపు నవంబరు 25, 26 నాటికి నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు భావిస్తున్నారు. .

రిజర్వేషన్లు ఇలా ఉండబోతున్నాయి?

జిల్లాలో 571పంచాయతీలకు గాను మొత్తం 99 షెడ్యూల్ ట్రైబ్స్‌లో (ఏజెన్సీప్రాంతంలో) ఉండనున్నాయి. వీటిలో సగం స్థానాలు మహిళలకు పురుషులకు కేటాయించనున్నారు. (50 స్థానాలు మహిళలకు, 49 పురుషులకు) మైదాన ప్రాంతంలో 461పంచాయతీలున్నాయి. వీటిలో 50శాతం రిజర్వేషన్లు కేటాయించనున్నట్లు తెలిసింది. మరో 50శాతం జనరల్‌కు కేటాయించనున్నారు. వీటిలో 54గ్రామపంచాయతీలు బీసీకి, 110స్థానాలు ఎస్సీకి, 61స్థానాలు ఎస్టీకి, మిగిలిన 236 స్థానాలు జనరల్‌కు కేటాయించనున్నట్లు తెలిసింది. ఎస్సీఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిసి 49శాతం, జనరల్‌కు 51శాతం కేటాయించనున్నట్లు తెలిసింది.వీటిలో మహిళలకు ఎన్ని, పురుషులకు ఎన్నిరిజర్వ్ అయ్యాయనే విషయాలపై ఇంకా కసరత్తు కొనసాగుతోంది. ఆర్డీవోలు సిద్ధం చేసిన రిజర్వేషన్ల జాబితాను జిల్లాస్థాయి అధికారులు పరిశీలించి తర్వాత సూపర్ చెక్ అయ్యాక కలెక్టర్‌కు నివేదించనున్నారు.



● పంచాయతీల వారీగా 5214 వార్డులకు రిజర్వేషన్లను ఖరారు కానున్నాయి. వీటిలో ఎస్టీలకు 1161 ఎస్సీలకు 935, బీసీలకు 697 పంచాయతీలు, జనరల్‌కు 2,421వార్డులను కేటాయించనున్నట్లు తెలిసింది.అయితే వీటిల్లోనూ మహిళలకు, పురుషులకు వార్డుల కేటాయింపుపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

జిల్లాలో ఓటర్ల ప్రక్రియ వివరాలు ఇలా

జిల్లాలో గ్రామీణప్రాంతాల ఓటర్ల వివరాలను అధికారులు లెక్కతేల్చారు. జిలాల్లో మొత్తం ఓటర్లు 8లక్షల 02వేల 690 మంది ఓటర్లు ఉండగా వీరిలో 3లక్షల 88వేల243 మంది పురుష ఓటర్లు ఉండగా,4లక్షల14వేల425 మంది మహిళఓటర్లు ఉన్నారు. థర్డ్ జెండర్లు 22 మంది ఉన్నారు ఓటర్ల లెక్కలు తేలడంతో అధికారులు రిజర్వేషన్ ప్రక్రియను శనివారం రాత్రికి పూర్తి చేస్తే ఆదివారం నాటికి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసే ఆస్కారం ఉంది.

మెడికల్ కళాశాలలో ఫిజియాలజీ డే

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఖమ్మంమెడికల్ కళాశాలలో ఫిజియాలజీ వారోత్సవాలను (శరీరధర్మశాస్త్ర) వేడుకలను శనివారం నిర్వహించారు. ఫిజియాలజీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు రంగోలీపోటీలు, స్కిట్స్, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్, వైద్యులు సదానందం, కళ్యాణి, శ్రీనివాస్, సమతారాణి తదితరులు పాల్గొన్నారు.



న్యూఇరాలో ఎన్‌సీసీ డే సేవా కార్యక్రమం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): న్యూఇరా గ్రూప్‌స్కూల్స్‌లో శనివారం నగరంలోని జీవన సంధ్య వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. డైరక్టర్ పి.భూమేశ్వరరావు మాట్లాడుతూ ఎన్‌సీసీ కేవలం క్రమశిక్షణ శిక్షణసంస్థ మాత్రమే కాదు అని సమాజానికి సేవా చేసే నాయకులను తయారు చేసే వేదిక అన్నారు. యువతలో సానుభూతి,సేవాభావం, దేశభక్తి వంటి విలువలను పెంచడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో సహాయ పడతాయని అన్నారు. పాఠశాల తరపున వృద్ధులకు మధ్యాహ్న భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీవో సంజయ్‌కుమార్ భద్ర, ఏవో నవీన్ యాదవ్ పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృష్యం

కేకేసీ నగర అధ్యక్షుడిగా కెంబసర్తి

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అనుబంధ అఖిల భారత అసంఘటిత, కార్మికుల సంఘం ఖమ్మం నగర అధ్యక్షుడిగా కెంబసర్తి నాగేశ్వరరావును నియామకం చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ కౌశల్ సమీర్, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విప్లవ్‌కుమార్ ద్వారా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.

'చెకుముకి'లో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు చెకుముకి టాలెంట్‌టెస్ట్‌లో ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచారని పాఠశాల చైర్మన్ ఆర్ వి.నాగేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం శాంతినగర్ స్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో జ్ఞానవిజ్ఞాన వేదిక బాధ్యులు విద్యార్థులకు బహుమతులు అందచేశారు. పదోతరగతికి చెందిన మధు పల్లవి, తొమిదో తరగతికి చెందిన కోకిల ప్రియ, ఎనిమిదో తరగతికి చెందిన జస్మితశ్రీ విజేతలుగా నిలిచారని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్

మోసగించిన వ్యక్తి పై కేసు నమోదు

ఖమ్మంక్రైం,నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ఓసంస్థలో డబ్బులు పెడితే లాభం వస్తుందని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ లో శనివారం రాత్రి కేసు నమోదు అయింది. శ్రీనగర్ కాలనీకి చెందిన గుగులోత్ నవీన్ అనే యువకుడికి మధురనగర్‌లో నివసించే రాజపాటివినయ్‌బాబు పరిచయమయ్యాడు. తన సంస్థలో పెట్టుబడి పెడితే రెట్టింపుడబ్బులువస్తాయని మాయ మాటలు చెప్పాడు. గతమేలో సుమారు రూ.9లక్షలు పెట్టుబడి పెట్టించాడు. పలు మార్లు డబ్బులు అడిగితే వినయ్‌బాబు ఇవ్వలేదు. దీంతో నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నాగండ్ల దీపక్‌చౌదరి

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నాగండ్ల దీపక్‌చౌదరి నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ నుంచి శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి ఆదేశాలు పంపారు. 1998లో ఎన్ఎస్‌యూఐ నాయకులుగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 36వ డివిజన్ కార్పొరేటర్‌గా పనిచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై అనేక పోరాటాలు చేశారు. ఖమ్మం బీబ్లాక్ అధ్యక్షుడిగా జిల్లా కాంగ్రెస్ స్పోక్ పర్సన్‌గా జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఖమ్మం నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగండ్ల దీపక్‌చౌదరి పార్టీ బాధ్యతలను చూస్తున్నారు. నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నుంచి నగర అధ్యక్షులుగా పదోన్నతి పొందారు.

తుమ్మల నాగేశ్వరరావు చొరవతోనే.. నాగండ్ల దీపక్‌చౌదరి

25ఏళ్లుగా కాంగ్రెస్‌పార్టీలో పనిచేస్తున్నాను. అనేక పార్టీ పదవులు వచ్చాయి. కార్పొరేటర్‌గా బాధ్యతలు నిర్వహించి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజా సమస్యలు పరిష్కారం, అభివృద్ధి కోసం పోరాటాలు చేశా, మా తాతల నుంచి కాంగ్రెస్ కుటుంబంగానే ఉన్నాం. నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకం కావటానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తుమ్మల యుగంధర్ సహకరించారు. కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాలు మేరకు పనిచేస్తానని పేర్కొన్నారు.

వైద్య ఖర్చులు చెల్లించాల్సిందే

ఖమ్మం వినియోగదారుల కమిషన్ తీర్పు

ఖమ్మంలీగల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): బాధితుడికి వైద్యఖర్చులు చెల్లించాల్సిందేని ఖమ్మం వినియోగదారుల కమిషన్లో దాఖలు చేసిన కేసులో శనివారం కమిషన్ ఎఫ్ఏసీ ఇన్‌చార్జ్ వి.లలిత, మెంబర్ మాధవిలత తీర్పు చెప్పారు. వైరా మండలం మాటూరిపేటకు చెందిన పిడతల వెంకటేశ్వర్లు వైరా ఎస్‌బీఐ బ్యాంకులో ఆరోగ్య భద్రత కలిగిన పాలసీ కొనుగోలు చేశాడు. అనంతరం అతడికి కిడ్నీ సమస్య తలెత్తటంతో ఖమ్మం నగరంలోని శ్రీరామ్ కిడ్నీ సెంటర్లో చికిత్స చేసుకోగా వైద్యం ఖర్చులకు గాను రూ.79,300 రూపాయలు బిల్లు వేశారు. ఈ నగదు చెల్లించాలని బాధితుడు ఇన్సూరెన్స్ కంపెనీని కోరగా కంపెనీ వారు డబ్బులు చెల్లించకుండా నిరాకరించారు. అనంతరం ఫిర్యాదిదారుడు తన న్యాయవాది కె.లక్ష్మీనరసింహారావుద్వారా లీగల్‌నోటీసు జారీ చేశారు. వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. వైద్య ఖర్చులకు గాను రూ.79,302, లిటిగేషన్ ఖర్చుల కింద రూ.10వేలు, మానసిక క్షోభకు గురైనందుకు మరో రూ.10 వేలు మొత్తం కలిపి రూ.99,302 ఫిర్యాదికి చెల్లించాలని తీర్పు చెప్పారు.

ఎస్‌బీఐటీలో ఫ్రెషర్స్‌డే

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళిక కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్‌జి.ధాత్రి, ప్రిన్సిపాల్‌రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

శబరిమలలో అసౌకర్యాలపై ఆగ్రహం

» **కేరళ ప్రభుత్వంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఫైర్**

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): శబరిమల దర్శనానికి విచ్చేసిన అయ్యప్ప భక్తులు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలు, భక్తుల పట్ల సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా వ్యవహరించిన తీరుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిండు దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములకు ఆలయ పుణ్యక్షేత్రంలో కల్పించాల్సిన కనీస సౌకర్యాలు లేకపోవడాన్ని, వారి పట్ల అవమానకరంగా ప్రవర్తించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన తాండ్ర రామ్‌ప్రసాద్ గురుస్వామి అయ్యప్ప పీఠాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అయ్యప్ప భక్తుల ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ, భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అడవులు, కొండప్రాంతాల్లోని పుణ్యక్షేత్రానికి పాదయాత్ర చేసే భక్తులకు వర్షపాతం వంటి పరిస్థితుల్లో తక్షణ చర్యలు, మెరుగైన సౌకర్యాలు లేకపోవడం కేరళ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఇటీవల, తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన అయ్యప్ప భక్తులు దారి అడిగినందుకు అక్కడి సెక్యూరిటీ సిబ్బంది దుర్భాషలాడటం, అసభ్యకరమైన సైగలు చేయడంపై నెల్లూరి కోటేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు సన్నీ ఉదయ ప్రతాప్,మద్దినేని హరిహర, మందడపు సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లగట్టు ప్రవీణ్ కుమార్, రవిగౌడ్, నరుకుల వెంకటేశ్వర్లు తాండ్ర రాంప్రసాద్ స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామ్ ప్రసాద్ స్వామి

వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు

ఖమ్మంరూరల్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటిలో వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించగా ప్రజలు వీధిలైట్ల సమస్యను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు వీధిలైట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ద్వారా సర్వే చేయించగా 642 స్థంబాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అవసరమైన వాటికి మరమ్మతులు చేయించి డిసెంబరు 15లోపు వీధిదీపాలు ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఎలక్ట్రీషియన్ల సమస్యలను పరిష్కరించాలి

సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా నాయకుడు శ్రీను

నేలకొండపల్లి, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని,సంఘం జిల్లా నాయకుడు వీసం శ్రీనివాసరావు కోరారు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల మండల మహాసభ శనివారం నేలకొండపల్లిలోని శ్రీకరగార్డెన్స్‌లో జరిగింది. సైదిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైవేటు ఎలక్ట్రీషియన్లకు బీమా సౌకర్యం కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్.నాగుల్‌మీరా, కార్యదర్శిగా అమరగాని వీరస్వామి, ఉపాధ్యక్షుడిగా గంజికుంట్ల స్వామి, కోశాధికారిగా దేవరపల్లి భూపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో కోలేటి మస్తాన్‌రావు, దేశబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆరుగ్యారంటీలను అమలు చేయాలి

ఖమ్మంఅర్బన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఆరుగ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ నాయకులు షేక్ హిమాం డిమాండ్ చేశారు. శనివారం త్రీటౌన్ ప్రాంతంలోని మంచికంటి నగర్‌లో జరిగిన 47వ డివిజన్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. హామీలను వెంటనే నెరవేర్చక పోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలకు పూనుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ ఖాసీం,లింగాల వెంకటనారాయణ, షేక్ జానీ, షేక్ పాషా పాలొన్నారు.

చిమ్మపుడిలో వ్యాసరచన పోటీలు

రఘునాథపాలెం,నవంబరు22(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా చిమ్మపుడిలోని విశ్వనాథచారి వజ్రమ్మల గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం లలితబాయి వ్యాసరచన పోటీలను పర్యవేక్షణ చేశారు. అనంతరం 36మంది విద్యార్థులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ బాధ్యులు రంగారావు, సాంబశివరావు రామారావు గ్రంథాలయ నిర్వహణను అభినందించారు. గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి, వెంకటరెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు: ఎస్ఐ జగదీష్

తిరుమలాయపాలెం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): గ్రామల్లో అల్లర్లు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కూసుపుడి జగదీష్ పేర్కొన్నారు. శనివారం కొక్కిరేణిలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా అందర సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వీరస్వామి, రమ, నాయకులు సైపుద్దీన్, సిరిగెద్ద ఉపేందర్ పాల్గొన్నారు.

నేడు శతమాసాల 'నెలనెలా వెన్నెల'

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదివారం సాయంత్రం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శతమాసాల పండుగ నెలనెల వెన్నెల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ వివరాలను నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, జగన్‌మోహన్‌రావు, కళాపరిషత్ అధ్యక్షుడు నాగబత్తిని రవి, దేవేంద్ర, వేల్పుల విజేత వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరవుతున్నట్లు తెలిపారు. 2015 జూన్ 15న నుంచి 2025 నవంబర్ 23వ తేదీ జరగబోయే ప్రదర్శనతో శతమాసాల వెన్నెల 100వ ప్రదర్శన కార్యక్రమం జరగబోతుందని అన్నారు.

జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారమేదీ?

టీయూడబ్ల్యుజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి రాంనారాయణ



అన్నం శ్రీనివాసరావును సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఇప్పటి వరకు వినతిపత్రాలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని, కానీ రెండేళ్ల పాలనలో ఇప్పటి వరకు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నోచుకోలేదని టీయూడబ్ల్యుజే (ఐజేయూ) రాష్ట్రకార్యదర్శి కె.రాంనారాయణ పిలుపునిచ్చారు. డీపీఆర్సీ భవనంలో శనివారం టీయూడబ్ల్యుజే (ఐజేయూ)జిల్లా కార్యవర్గసమావేశంలో మాట్లాడారు. జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీ ద్వారా సర్వసభ్య సమావేశం నిర్వహించి ఇళ్లస్థలాల సాధనకు ఉద్యమిస్తామన్నారు.ఈసమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరావు, టీయూడబ్ల్యుజే (ఐజేయూ) జాతీయ కార్యవర్గసభ్యులు నలజాల వెంకటరావు, రాష్ట్రకౌన్సిల్‌సభ్యుడు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సామినేని మురారి, యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు మామిడి. భూపాల్, నగర అధ్యక్షుడు సీహెచ్‌శ్రీనివాస్ ప్రసంగించారు. యూనియన్ అభ్యున్నతికోసం దాడులునివారణ కమిటీ, హెల్త్‌కమిటీ, సంక్షేమకమిటీ ఎన్నుకున్నారు. నగరంలో అన్నం ఫౌండేషన్ ద్వారా అనాథలకు, అభాగ్యులకు అందిస్తున్న అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అన్నం శ్రీనివాసరావును సన్మానించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరుమలాయపాలెం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన ఆర్థిక సాయాన్ని శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో అందించారు. మండలంలోని 49మందికి రూ.19.81 లక్షల చెక్కులను ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ అందించారు.

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ వసుంధర

సత్తుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేహౌండ్స్ ఏఎస్పీగా పనిచేస్తున్న కల్లూరు ఏసీపీగా బదిలీపై వచ్చిన యాదవ్ వసుంధర శనివారం సత్తుపల్లిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఆమెను మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందించారు. అనంతరం ఆమె ఖమ్మం వెళ్లి పోలీస్ కమీషనర్ సునీల్‌దత్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ సబ్ డివిజన్ సిబ్బంది, ప్రజల సహకారంతో శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు నిరంతరం తాను అందుబాటులో ఉంటానని చెప్పారు.

ఆరోగ్యం.. జాగ్రత్తలు తప్పనిసరి



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు సురేష్

వేంసూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆహారం, ఆరోగ్యం విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సురేష్ రామాల అన్నారు. సత్తుపల్లిలోని న్యూస్టార్ చిల్డ్రన్స్ హాస్పిటల్, ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మర్లపాడులోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు ప్రైమరీ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్, ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుభద్రమ్మకు ప్రముఖుల నివాళి



సుభద్రమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చందర్‌రావు

కల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందిన ఆర్యవైశ్య ప్రముఖురాలు పసుమర్తి సుభద్రమ్మకు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం స్థానిక సీహెచ్ఎన్ఆర్ కళ్యాణమండంలో సుభద్రమ్మ సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావుతో పాటుగా ఆర్యవైశ్య ప్రముఖులు చారుగుండ్ల అచ్యుతసీతారామరావు, దోసాపాటి కృష్ణార్జున రావు, చలువాది నగేష్, దోసపాటి శ్రీనివాసరావు, వేముల వాసు సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సుభద్రమ్మ కుమారులైన పసుమర్తి శ్రీనివాసరావు, రామకృష్ణారావు (రాంబాబు)లను పరామర్శించారు. చండూరి శ్రీనివాసరావు, చారుగుండ్ల సందీప్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు



పరీక్షలు చేయించుకుంటున్న డ్రైవర్లు

సత్తుపల్లిరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డ్రైవర్లకు ఏర్పాటు చేసిన ఉచితం కంటి పరీక్షలను శనివారం డీఎం ఊటుకూరి సునీత ప్రారంభించారు. ఉద్యోగుల భద్రత, ఆరోగ్యం కోసం సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్నామని, సిబ్బంది సద్వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా 200మంది ఉద్యోగులను పరీక్షలు నిర్వహించగా అవసరమైన వారికి ఖమ్మం, తార్నాకలో మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, వైద్యులు వీ.సాయిసుష్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లాడలో ఘనంగా మహా పడిపూజ

- గురుస్వామిని సన్మానించిన భక్తులు

తల్లాడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటమైసమ్మ దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం అర్ధరాత్రి అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. బొడ్డు శ్రీను 18వ సారి అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టినసందర్భంగా అర్చకడు మణికంఠశర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, 18మెట్లను పడి వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి ఈలప్రోలు లాలయ్య బృందం అయ్యప్పస్వామి భక్తి గీతాలు ఆలపించారు. బొడ్డు శ్రీను దంపతులను సన్మానించారు. అనంతరం భక్తులకు అల్పాహారం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



కల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకోరుకొండి గ్రామ పంచాయితీ శివారు దారుకాబంజర గ్రామలో సోమవారం నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగనుందని ఆ గ్రామ నందమూరి అభిమానులు తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో నందమూరి తనయుడు రామకృష్ణచే ఈ విగ్రహ ఆవిష్కరణ చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టీడి జనార్ధన్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటుగా, రాష్ట్ర, జిల్లా ముఖ్య నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు హాజరవుతున్నట్లు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

మద్రాస్ ఐఐటీలో శిక్షణ పొందిన న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థులు



మద్రాస్ యూనివర్సిటీ నుంచి లైఫ్ స్కిల్స్ సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో భూమేశ్వరరావు

వైరా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని ప్రతిష్టాత్మకమైన ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీ వారు ఆఫర్ చేసిన వివిధ రకాల లైఫ్ స్కిల్స్ కోర్సుల్లో వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల, కళాశాల విద్యార్థులు శిక్షణ పొందారు. 52మంది విద్యార్థులు 8వారాలపాటు ఆన్‌లైన్‌లో డేటా సైన్స్, ఏఐ ప్రోగ్రామ్స్‌లో శిక్షణ పొందారు. వీరిలో 49మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనపర్చి శిక్షణ పొందిన సర్టిఫికెట్స్‌ను అందుకున్నారు. ఈ విద్యార్థులను ఆపాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూవ్, భువనప్రసాద్, ఏవో ఎస్.నర్సింహారావు అభినందించారు.

ఆర్థిక స్వావలంబనకే ఇందిరా డెయిరీ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- త్వరలోనే పనుల ప్రారంభం
- ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



ఇందిరా డెయిరీ ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న భట్టి



మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం

బోనకల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంభకే ఇందిరా డెయిరీని ఏర్పాటు చేస్తున్నామని, తనకు ఎంతగానో తృప్తి కలిగించే ప్రాజెక్టు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బోనకల్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఇందిరా డెయిరీకి సంబంధించి రూ.1.75 కోట్ల నిధులతో చేపట్టనున్న ప్రహరి నిర్మాణం, గ్రౌండ్ లెవలింగ్ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాధ్యమైనంత తొందరలోనే ఇందిరా డెయిరీ పనులను ప్రారంభిస్తామన్నారు. పాల ఉత్పత్తుల ద్వార ఆర్థిక ఎదుగుదలతో పాటు పేద కుటుంబాల్లోని యువతకు ఉపాధి కూడ దొరుకుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క మహిళకు ఇందిరమ్మ చీర అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునిల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీఆర్డీవో సన్యాసయ్య, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వర రావు, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వర రావు, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, గాలి దుర్గారావు, చేబ్రోలు వెంకటేశ్వరరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, బీపీ నాయక్, తోటపల్లి స్వామి, బండి వెంకటేశ్వర్లు, మరీదు శ్రీను, నర్సయ్యశాస్త్రీ, తమ్మారపు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలను విడుదల చేసిన భట్టి

మధిర రూరల్: నిర్దేశిత లక్ష్యం ప్రకారం నీటి వనరుల్లో చేపపిల్లలను విడుదల చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం మధిర పట్టణంలోని పెద్ద చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న నీటి వనరుల్లో 77లక్షల చేపపిల్లలను విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మత్స్యశాఖ అధికారులతోపాటు నీటిపారుదల, వ్యవసాయ తదితరశాఖల అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల, మత్స్యశాఖ అధికారి శివ ప్రసాద్ పాల్గొన్నారు.



మధిర పెద్ద చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న భట్టి

మడుపల్లిలో పర్యటించిన భట్టి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం రాత్రి మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ గ్రామ కాంగ్రెస్ నాయకుడు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుమార్తె రమ్యారెడ్డి వివాహం ఈనెల 26న జరుగనుండగా.. భట్టి విక్రమార్క శ్రీనివాసరెడ్డి ఇంటికి వెళ్లి రమ్యారెడ్డిని ఆశీర్వదించారు.

ఔషధ రంగంలో ఉన్నత స్థానం సాధించాలి

- 'మదర్ థెరిస్సా' ప్రిన్సిపాల్ డాక్టర్ యర్రా రాజేశ్వర్

సత్తుపల్లిరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఔషధ రంగంలో మంచి పరిజ్ఞానంతో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఉన్నతస్థానం సాధించాలని మదర్ థెరిస్సా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యర్రా రాజేశ్వర్ అన్నారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా శనివారం మండలంలోని కొత్తూరులోని కళాశాలలో టీకాకు మద్దతుదారులుగా ఫార్మాసిస్టులు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునే మార్గాలలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే విధానాలను ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. జాతీయ ఫార్మసీ వారోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, పోస్టర్, పీపీపీ ప్రజంటేషన్, వకృత్వ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, డైరెక్టర్ డాక్టర్ కందిమళ్ల కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్ రాజా జయవరపు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు స్వామి



రాష్ట్రస్థాయికి ఎంపికైన స్వామి

సత్తుపల్లిరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న జీ.స్వామి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్‌కే.సోందు శనివారం తెలిపారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలుర ఎంపికల్లో ఈ ఎంపిక జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

అనారోగ్యంతో బీటెక్ విద్యార్థిని మృతి



బ్లెస్సీ (ఫైల్)

సత్తుపల్లిరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతూ బీటెక్ విద్యార్థిని మృతి చెందిన సంఘటన శనివారం సత్తుపల్లి మండలంలో చోటుచేసుకుంది. గంగారం పీహెచ్‌సీ వైద్యులు ఆర్.అవినాష్ తెలిపిన వివరాల ప్రకారం కిష్టారం గ్రామానికి చెందిన నక్కా మోషే, సుజాత దంపతుల కుమార్తె బ్లెస్సీ (18) బీటెక్ చదువుతుంది. ఈ క్రమంలో కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతుండగా ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

బాధిత కుటుంబానికి సీఎంఆర్ చెక్కు అందజేత

కారేపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలంపల్లి గ్రామానిక చెందిన కోరం సమ్మయ్యకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శనివారం వైరా క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహనిధి నుంచి వచ్చిన చెక్కును అందచేశారు. సమ్మయ్య భార్య లక్ష్మీ ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఇందుకు సీఎం సహనిధి నుంచి రూ.17,500 విలువగల చెక్కను అందచేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకురాలు హేమలత బాలాజీతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

బోనకల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బోనకల్ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఒప్పంద పద్ధతిపై పని చేసే స్కావెంజర్ పోస్టుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో దామాల పుల్లయ్య కోరారు. 18 ఏళ్ల నుంచి 45 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న మహిళలు, 7వ తరగతి కనీస అర్హతగా ఉండాలన్నారు. ఈ నెల 24వ తేది లోపు కేజీబీవీ పాఠశాలనందు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులు చేసుకునే వారు 7వ తరగతి మార్కుల మెమో, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్ ఫోటో, భర్త లేని వారు ఐతే అతని మరణ ధ్రువీకరణ పత్రం, ఫోన్ నంబర్లను జతపరచాలని విజ్ఞప్తి చేశారు.

వైరాలో చెకుముకి సంబరాలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

వైరా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైరా మండలస్థాయి చెకుముఖి సంబరాలను శనివారం వైరా ప్రభుత్వ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకుడు మల్లెంపాటి వీరభద్రరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మాధవరావు, సత్యనారాయణ ఈ సంబరాలను ప్రారంభించారు. ఈ సంబరాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ పాఠశాలలు ఇంగ్లీషుమీడియం విభాగంలో ప్రథమ బహుమతి రెబ్బవరం పాఠశాల, ద్వితీయ బహుమతి వైరా ప్రభుత్వ హైస్కూల్, తృతీయ బహుమతి సిరిపురం పాఠశాల గెల్చుకున్నాయి. గురుకుల పాఠశాలల్లో ప్రథమ బహుమతి వైరా గురుకుల బాలికల పాఠశాల, ద్వితీయ బహుమతి రెబ్బవరంలోని ముసలిమడుగు బీసీ గురుకుల పాఠశాల, తృతీయ బహుమతి వైరా సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి మధు విద్యాలయం, ద్వితీయ బహుమతి వాణీ వివేకానంద విద్యాలయం గెల్చుకున్నాయి. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు బీరెల్లి రామకృష్ణ, యాకోబు, ప్రసాద్, వెంకట్రావ్, కృష్ణారావు, వెంకటేశ్వర రావు, సమీన్, సునంద, పద్మజా పాల్గొన్నారు.

ప్రవీణ్ కుటుంబానికి సండ్ర పరామర్శ



వైబి పల్లిలో పోట్రు పుష్పవతి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు, నవంబరు22 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన పోట్రు పుష్పవతి (50) ఆనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ మేరకు సమాచారం అందుకున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో పాటుగా పలు పార్టీల నాయకులు ఎర్రబోయినపల్లి గ్రామంలో పోట్రు నివాసంలోని పుష్పవతి మృతదేహనికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పుష్పవతి కుమారులైన పోట్రు ప్రవీణ్, కిరణ్, ప్రకాష్‌లను సండ్రతో పాటుగా, పలువురు ప్రముఖులు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం తెలిపారు. ఈ మేరకు సండ్రతో పాటుగా పరామర్శించిన వారిలో మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు పాలెపు రామరావు, లక్కినేని రఘు, పెడకంటి రామకృష్ణ, తోపాటుగా టిడిపి సీనియర్ రాష్ట్ర నాయకుడు కాకర్ల రంగారావు, పోట్రు శ్రీనుతో పాటుగా తదిరులు ఉన్నారు. పాల్గొన్నారు.

పారదర్శకంగా రిజర్వేషన్ల ప్రక్రియ

- కల్లూరు సబ్ కలెక్టర్



కల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం, ప్రభుత్వం నిర్దేశించిన, కోర్టు నిబంధనలకు లోబడి 50 శాతం రిజర్వేషన్లు మించకుండా లాటరీ పద్ధతి ద్వారా బీసీ, ఆన్ రిజర్వుడు గ్రామ పంచాయితీ సర్పంచుల రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సంబంధించిన వివరాలను వెల్లడించారు. కల్లూరు మండలంలో 23 గ్రామ పంచాయితీలలో ఎస్టీ 2, ఎస్సీ 7, బీసీ 2, ఆన్‌రిజర్వుడు కింద 12 గ్రామ పంచాయితీల సర్పంచులు ఉంటారు.

కొణిజర్ల: మహిళా కేటగిరీకి సంబంధించి వార్డు సభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియ ఎంతో పారదర్శకంగా డ్రా పద్ధతిలో తీసినట్లు ఎంపీడీవో జి.వర్ష తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిజర్వేషన్ల డ్రా పద్ధతికి వివిధ రాజకీయపార్టీల నాయకులు హాజరయ్యారు. వారి సమక్షంలో డ్రా పద్ధతిలో రిజర్వేషన్లను తీశారు. ఎంపీవో ఉపేంద్రయ్య, సూపరింటెండెంట్ రవికుమార్, వివిధ రాజకీయపార్టీల మండల కార్యదర్శి అధ్యక్షులు పాల్గొన్నారు.

మధిర రూరల్: నిబంధనల ప్రకారమే గ్రామపంచాయతీల మహిళా వార్డు రిజర్వేషన్లను ఖరారు చేస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలు రాజకీయ పక్షాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి వారి సమక్షంలోనే మహిళలకు కేటాయించే వార్డు రిజర్వేషన్లను ఖరారు. పలు పార్టీల నాయకులు సూరంశెట్టి కిషోర్, మల్లాది హన్మంతరావు, మార్నీడి పుల్లారావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, వీరభద్రం పాల్గొన్నారు.

బోనకల్: ప్రభుత్వం స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావడంతో గ్రామాల వారీగా సర్పంచ్ అభ్యర్థుల రిజర్వేషన్ల ప్రక్రియను జిల్లా ఉన్నతాధికారులు పూర్తి చేశారు. గ్రామాల వారీగా రిజర్వేషన్లు బయటకు రావడంతో చర్చనీయాంశంగా మారింది.

కారేపల్లి: మండల పరిధిలోని 41 గ్రామ పంచాయతీలకు అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఈ పంచాయతిలలో సింగరేణి పంచాయతీ ఓసీ జనరల్‌గా, అప్పాయిగూడెం ఎస్సీకి ఖరారు కాగా.. మిగిలిన పంచాయతీలకు పాత రిజర్వేషన్లు యధావిధిగానే కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో పాటు వార్డుల రిజర్వేషన్లు ఖరారు అయితే పంచాయతీలలో రాజకీయ వేడి ఏర్పడనుంది.

ముత్యాల కవచాలంకారంలో జమలాపురం శ్రీవారు



ధ్వజస్థంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయలో శనివారం అర్చకులు సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాలకవచాన్ని అలంకరించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శనివారం కావడంతో ఆలయలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. చుట్టుపక్క గ్రామాలనుంచి మహిళలు కాలినడకన ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ సిబ్బంది ఉచితంగా అన్నవితరణ చేశారు. ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్ర మూర్తి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, ముఖ్య అర్చకులు రఘురామకృష్ణ, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, దేవాలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో సీపీఎం సత్తా చాటాలి



వైరా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు జరిగే సర్పంచ్ ఎన్నికల్లో సీపీఎం గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేసి సత్తా చాటాలని ఆపార్టీ డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. శనివారం వైరాలో తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు, నిధులు, విధులను ప్రభుత్వాలు సంపూర్ణంగా కేటాయించకపోవడం వలన పంచాయతీలు అభివృద్ధిలో వెనుకబడ్డాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల పట్ల నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నాయని ఆక్షేపించారు. గ్రామాల అభివృద్ధి సీపీఎం గెలుపుతోనే సాధ్యమని స్పష్టం చేశారు. నాయకులు సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, దొంతబోయిన నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, తోట నాగేశ్వరరావు, బొజ్జా రామారావు, బాదావత్ శ్రీనివాస్, కొండబోయిన ఉమాపతి, తూము సుధాకర్, ఏర్పుల రాములు, బోయినపల్లి శ్రీనివాసరావు, బాణోతు బస్సీలాల్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను నిలిపివేయాలి



మధిరలో నిరసనలో పాల్గొన్న కార్మికులు

మధిర రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతు కార్మిక వ్యతిరేక చట్టాలను నిలిపివేయాలని, నిబంధనలు సడలించి సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలని, మధిర ఏఎంసీలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మధిరలో సీఐటీయూ, రైతుసంఘం సంయుక్త ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికుల హక్కులను హరిస్తూ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తుందని హెచ్చరించారు. సీసీఐ ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నాయకులు పాపినేని రాంనర్సయ్య, శీలం నర్సింహారావు, మందా సైదులు, ఉపేంద్ర, వీరభద్రం పాల్గొన్నారు.

తీరేదైనా.. తడిపేందుకే!




దుక్కి తడి (నాటు పద్ధతి)



తుంపర్ల సేద్యం

చింతకాని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా యాసంగి పంటగా మొక్కజొన్న సాగు జోరందుకుంది. పెసర, పత్తి దుక్కులు శుభ్రం చేసి మొక్కజొన్న విత్తనాలు నాటుతున్నారు. ప్రతి ఏటా వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు తోడు ఆదునిక సాంకేతికత అభివృద్ధి చెందడంతో రైతులు శ్రమ వృథా కాకుండా సాగులో మెళకువలు పాటిస్తున్నారు. మొక్కజొన్న విత్తనాలు నాటిన అనంతరం పొలాలను తడిపేందుకు రైతులు శ్రమ, సాగు నీరు వృథా కాకుండా వివిధ పద్ధతులలో తేలికగా పొలాలను తడుపుతున్నారు.



బిందు సేద్యం



నల్లాల సేద్యం